…
by court statement
Within court state

# సృజన

అభ్యుదయ సాహిత్య వేదిక

మాస పత్రిక

జూన్ 1974

57

విప్లవ రచయితలపై, విప్లవ సాహిత్యంపై ప్రభుత్వం ఫాసిస్టు దమననీతిని కొనసాగిస్తున్న యీ పరీక్ష సమయంలో మనం మన పత్రికలను ఆర్థిక యిబ్బందుల నుండి కాపాడుకుంటూ ముందుకు సాగిపోవడం మన విప్లవ కర్తవ్యం–

ప్రతి పాఠకుడూ తాను చందాదారుడై మరో చందాదారుణ్ణి చేరిపిస్తే 'సృజన' యిబ్బందులు లేకుండా కొనసాగుతుంది.

పాఠకులూ, అభిమానులూ 'సృజన'కు ఆర్థికంగా తోడ్పడగలరని మనవి–

'సృజన' ఏజంట్లవద్దా, చందాదారులవద్దా బకాయీలు పేరుకొని పోయినవి– వెంటనే బకాయీలు పంపించి పత్రిక నిర్వహణకు తోడ్పడగలరని విజ్ఞప్తి చేస్తున్నాం–

నిర్వహణ
'సాహితీ మిత్రులు'

1 రూపాయి

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Venkataramana Mudranalayam,
J.P.N. Road, Warangal-506002 (A.P.)

# కుట్ర....

మళ్ళీ పోలీసు ప్రభుత్వం తన పుచ్చిపోయిన పంజావిప్పింది– మళ్ళీ విప్లవ రచయితలను అరెస్టుచేసింది– ఈ అరెస్టులు ప్రజల్లో వారికి లభిస్తున్న ఆదరాన్నీ, విప్లవం యెడ ప్రజల సుముఖత్వాన్నీ తెలుపుతున్నాయి– అలాగే పాలకవర్గ దివాళాకోరుతనాన్నీ ఖంగారునూ, పిరికితనాన్నీ తెలుపుతున్నాయి– దోపిడీవర్గం తన ప్రయోజనాన్ని కాపాడుకోడానికి, ప్రజా చైతన్యాన్ని అరికట్టడానికి ఎలాంటి కుట్ర పన్నుతుందో కూడా యీ అరెస్టులు తెలుపుతాయి– ఈసారి ఫాసిస్టు ప్రభుత్వం విప్లవ కవులను బనాయింపు కుట్రకేసులో యిరికించింది– నిజానికి ఎవరు ఎవరిపై కుట్రపన్నుతున్నారు ?

ప్రజాస్వామ్యం ముసుగులో ధనస్వామ్యం దోపిడీని రక్షించిపోషించే యీ దేశపు రాజ్యాంగమే ఒక పెద్దకుట్ర. మాస్కో, వాషింగ్టన్, టోక్యో, బాన్ యింకెక్కడెక్కడో తాకట్టుపడ్డ ఢిల్లీసింహాసనం కుట్ర– సింహాసనంమీది ఇందిరామందహాసం, ప్రతి పలుకూ శ్వాసా కుట్ర– ఈ సింహాసనం పాదాలు కడిగే మంత్రులూ ముఖ్యమంత్రులూ కుట్ర– వీరి కావలికుక్కలు పోలీసులు కుట్ర– ఆంతరంగిక భద్రతా చట్టం కుట్ర– దేశభద్రతా చట్టం కుట్ర– రకరకాల పీడన చట్టాలూ కుట్ర– తారు పులుముకున్న యిక్కడి బజార్లు కుట్ర– బజారు ధరలు కుట్ర– బ్యాంకులు కుట్ర– బ్యాంకుల జాతీయం కుట్ర– గరీబీ హటావ్ కుట్ర– ఆకాశవాణి కుట్ర– ఆకాశానికి పడగలెత్తిన మేడలు కుట్ర– ఆఫీసులు కుట్ర– ఎన్నికలు కుట్ర– ప్రణాళికలు కుట్ర– నిన్నగాక మొన్న పేలిన అణుబాంబు కుట్ర– ఈ ప్రభుత్వమే పెద్ద కుట్ర– ఈ వ్యవస్థే కుట్ర—

ఈ 'కుట్ర'కు బలైపోయిన యీ దేశంలోని 80% జనం, కార్మిక కర్షక కష్టజీవులు, బానిసలై బిచ్చగాళ్ళై పోయారు. నెత్తురు మడుగులైన తమ జీవితాల బాధ భరించలేక 1967 లో నక్సల్‌బరీ పేద రైతాంగం సాయుధంగా దోచుకుంటున్నవాడి మీదికి సాయుధంగానే తిరగబడ్డది– ఆ సాయుధ విప్లవాగ్ని యివాళ దేశం నలుమూలలా వ్యాపించింది– హింసకు ప్రతిహింస అనివార్యం– అనివార్యమైన యీ రక్తపాతం మానవతా దృక్పథంయొక్క అత్యున్నత రూపం– విప్లవ రచయితలు దీన్ని గానం చేయడం ప్రజల్లోకి తీసుకపోవడం 'కుట్ర' కాదు–

విప్లవకారులనూ విప్లవ రచయితలనూ జైల్లోపెట్టి వారిని ప్రజల్నుంచి దూరం చేయాలనుకోడం వెర్రి– గాలినీ, సముద్రాలనూ, ఎవరూ గోడల్లో బంధించలేరు– ప్రజలు పాలకవర్గపు యీ నిర్బంధాల కుట్రను తెలుసుకోలేరనుకోడం అవివేకం. ప్రజలే వీరిని విడిపించుకుంటారు–

తనచుట్టూ నిలబెట్టుకున్న పోలీసు మిల్ట్రీ ముళ్ళకంచె, ఆకాశవాణీ, వందిమాగధ కవులూ, పత్రికలూ, జ్ఞానపీఠాలూ, రకరకాలదేవుళ్లూ, విదేశీ ఒప్పందాలూ, యివేవీ యీ ప్రభుత్వాన్ని రక్షించలేవు– ఏ పోలీసులు తమకు యీనాడు రక్షణగా ఉన్నారో ఆ పోలీసులే యీ పాలకులకు ఎదురుతిరిగేరోజులు ఎంతో దూరంలోలేవు–

ఇవాళ జైళ్లు మండుతున్నవి– ప్రజలకన్నుల్లో ఎరుపు మొలుస్తున్నది– ఈవ్యవస్థ పునాదులు కదులుతున్నవి–

# "అయితే– ఎవరిదీ ప్రభుత్వం?"

రాచకొండ విశ్వనాథశాస్త్రి

దేశంలో చాలా గ్రామాలున్నాయి. వాటిలో కొన్నింటికి ఆరోగ్య శాఖలున్నాయి. ఆ ఆరోగ్య శాఖల్లోని అట్టడుగు సిబ్బంది వారంతా లోగడ ఓసారి తమకి...

"జీతాలు చాలవు,
బాధలు తీరవు,
మరింక మాకు మా దినాలు వెళ్ళవు"

అని తెలుసుకుని మంచి జీతాలకోసం– అంటే మంచి బతుకులకోసం సమ్మెచేశారు.

మనుషులు మంచి బతుకులు కావాలంటే ఫరవాలేదు– కాని అందు గురించి వారు మాటలతోపాటు చర్యల్లోకి దిగితే మాత్రం ప్రభువులు వూరుకోరు.

అందుచేత, అట్టడుగు సిబ్బందివారు సమ్మెలోకి దిగగానే ప్రభుత్వం అంతట సర్రున లేచింది, వెంటనే పోలీసు పడగలు విప్పింది. ఆరోగ్యశాఖల్లోని అట్టడుగు సిబ్బందంతా దేశానికి అత్యవసరమైన సిబ్బందిగా ప్రకటించింది, వారి సమ్మెని నిషేధించింది; సమ్మెచేసినవార్ని ఆర్మీ పోలీస్సియార్పీలచేత చావగొట్టింపించి చెవులుమూయింపించి చెరసాలల్లో తోయింపించి సమ్మెని చివరికి చంపించి సుఖంగా నిట్టూర్చింది.

అప్పుడు–

చచ్చిన సమ్మెలోంచి శవాల్లా లేచిన ఆరోగ్యశాఖల్లోని సిబ్బందివారంతా

"మమ్మల్ని ఆకల్లోముంచి వుంచి మా ప్రాణాలు తోడేసి తాగేసే ఈ ప్రభుత్వం మాది కాదు"

అని తెలుసుకొని

"మనదికాని ఈ ప్రభుత్వం మరైతే ఎవరిదిచెప్మా!" అనుకున్నారట, జవాబు తెలియక గజిబిజిపడ్డారట.

అలాగే

ప్రభుత్వ యంత్రాంగంలోని చిన్నకారు గుమాస్తాలు, సన్నకారు క్లాస్‌ఫోర్లు, అలాగే మోటారు పరిశ్రమలోని కారుచిన్న కూలీలు, అలాగ్గే రోడ్డురవాణా శాఖల్లోని బళ్ళవాళ్ళు, అలాగే విద్యుచ్ఛక్తి శాఖలోని చిన్నవారు, పంచదార మిల్లుల్లోని పసివారు, అలాగే బట్టల మిల్లుల్లో బరువు పనలన్నీచేసే తేలికవారు, అలాగే బొగ్గుగనుల్లో మసిబతుకులు బతికే నడివయసు ముసలివారు, అలాగ్గే పెద్దాచిన్నా రేవుల్లో చిక్కుపనులు చేసేవారు పెనుబరువులు మోసేవారు, అలాగే ఓడలు నడిపేవారు, విమానాలు తోలేవారు, ఉత్తరాలు మోసేవారు, భూమిలోంచి అకాశంలోకి భవనాలన్నింటినీ లేపేవారు, అలాగే

ఖాకీ బట్టలు కుట్టేవారు, తుపాకులు తుడిచేవారు, తూటాల తయ్యారీవారు, అలాగే బళ్ళోడలు కట్టేవారు, యంత్రాలన్నీ నిర్మించేవారు, అలాగ్గే బడిపంతులుద్యోగం చేసేవారు, బండలమీద బట్టలు బాదేవారు, బండచాకిరీ చేసేవారు బరిడలు కొట్టేవారు, కొండలు తవ్వేవారు, బాటలు వేసేవారు, అలాగే చెప్పులు కుట్టేవారు, చేపలు పట్టేవారు, మేకలు కాసేవారు, అలాగే ఎర్రటెండలో ఎండి నల్లటివానలో నాని ఆకలనే మంటలో మాడి తమకి దక్కని అన్నమనే బంగారాన్ని పండించి పోగుచేసి సిరిసిరిలవారికోసం నిలవచేసి ఉంచే కూలినాలివారు, పొగలో మసిలేవారు, నిప్పుల నడిచేవారు, చెమటలు ఓడ్చేవారు, నెత్తురు కార్చేవారు, రొదగా ఏడ్చేవారు అందరిలాగే వేర్వేరుగా ఒక్కొక్క సారిగా సమ్మెలో సత్యాగ్రహాలో ఏవో చేసి చేసి చివరకి ఏంతెలుసుకున్నారంటే

తమనిచంపే ఈ ప్రభుత్వం తమదికాదని తెలుసుకున్నారు.

అదే విషయాన్ని ఇప్పుడు ఈరోజున

మన రెయిల్వే కార్మికులు తెలుసుకుంటున్నారు.

* * *

"అయితే ఇంతమందిదీకాని ఈ ప్రభుత్వం ఎవరిదబ్బా ఈ ప్రభుత్వం ?"

జవాబు కావాలా ?

"కావాలి"

అయితే అడగవయా అల్లూరి సీతారామరాజుని!

"అతనిప్పుడు లేదుకద"

అయితే, వెళ్ళవయా వెంపటాపు సత్యందగ్గరికి

"అతనూ లేడుకద"

మరైతే అడగవయా మన చారు మజుందార్ని!

"అయ్యో! అతనూలేడే!

మరైతే మనం ఏంచేదామంటే— ఒక్కటిచేదాం! విడి విడి సమ్మెల్లో పడి పడి లేచినవారినందర్నీ ఒక్కసారిగా ఉవ్వెత్తుగా లేచి నిలబడి పెనుప్రళయంగా ఓ సవాల్ సమ్మెకి పిలుపునిమ్మందాం! అప్పుడు ఎవడైతే వారిమీదకి కత్తెత్తుతాడో వాడిదిమాత్రం ఈ ప్రభుత్వం అని మనకి తెలిసిపోతుంది!

తెలిసిపోతుంది. బాగానేవుంటుంది. కాని, తెలుసుకున్నతర్వాత ఏంచెయ్యడం?"

నువ్వేచెప్పు నిత్యంనీదీ నీ పెళ్ళాం పిల్లల్దీ నెత్తురుతాగేవాణ్ణి నువ్వేంచేస్తావు? వెళ్ళి వాడికాళ్ళు పడతావా, లేక పీక పిసుకుతావా ?

"...నేను కాళ్ళుపట్టను! పట్టనుకాక పట్టను!!"

మరైతే మాదారికి రా!!!

## ఏటికికి ఎదురీదు వాళ్ళమురా!

రెంజిమ్

మేరిమి కొండల్లో మెరిసింది మేఘము
ఉద్ధమాల కొండల్లో ఉరిమింది మేఘము
కురుపము కొండల్లో కురిసింది వర్షము
సంగమొలసా కొండల్లో సాగింది వర్షము
ఏరుమీద ఏరొచ్చెరా! ఓ! జాలరన్నా!
ఏరు ఎచ్చుగా పారెరా! ఓ! జాలరన్నా!
మెండు చీకటి కమ్మెరా!

తెర్లకొయ్య విరిగింది, తెరచాప చిరిగింది
పడవ కడుపులోన కలకలము రేగింది
మొనగాడు తమ్ముణ్ణి మొసలి మింగేసింది
ఎదిగిన తమ్ముణ్ణి ఏరు కాటేసింది
గుండెజారిన దండు గంగాకు మొక్కింది
చేతిలో తెడ్లను ఏటిలో విసిరింది

నీతి తప్పని వాళ్ళమురా! ఓ! జాలరన్నా!
నీతోనే వుంటామురా!

తెరకొయ్య విరిగినా, తెరచాప చిరిగినా
కోటి పడగలువిప్పి ఏరు బుసకొట్టినా
మొనగాడు తమ్ముణ్ణి మొసలి మింగేసినా
ఎదిగిన తమ్ముణ్ణి ఏరు కాటేసినా
గుండె జారిన దండు గంగాకు మొక్కినా
పల్లె కారుల్లోనా కల్లోలంపుట్టినా
గుండెలోని ఆశ- ఎర్రి- జెండాగా ఎగరాలి!

కళ్లలోని కాంతి బాట వెలిగించాలి।
చీకటిలో మిణుగురులు చూడటం తెలవాలి।
పట్టుదల పాళింగా నావ నడిపించాలి।
చుక్కాని చేపట్టరా। ఓ జాలరన్నా।
నిక్కముగా దరి జేర్చరా। ఓ జాలరన్నా।
ఏటికి ఎదురీదు' వాళ్ళమురా। ఓ జాలరన్నా।
నూటికి ఒకడున్న చాలునురా, ఓ జాలరన్నా।
కోట్ల జనులను కూడ కదుదుమురా।
చుక్కాని చేపట్టరా। ఓ జాలరన్నా।
నిక్కముగా దరిజేర్చరా। ఓ జాలరన్నా।
తూరుపు- దిక్కుగా నడిపించరా।

ఏలేసా ఏలేసా
హైలేసా హైలేసా
జోర్ సెయ్ బార్ సెయ్
బార్ సెయ్ జోర్ సెయ్
ఇంతే ఇంతే నాయనా
ఇంతే ఇంతే నయ్యన
ఎంతకాలం చీకటి
కొంతకాలమే నయ్యన
చందమామలాటి
అందమైన దీవి
జోర్ సెయ్ బార్ సెయ్
బార్ సెయ్ జోర్ సెయ్
హైలేసా హైలేసా
ఏలేసా ఏలేసా.........

(శ్రీకాకుళం జిల్లాలో వినిపించే జాలరన్న పాటకు కృతజ్ఞత)

కథలు :

# బుగతగాడి మాంసం

జాక్ బెల్డెన్

(ఈ కథ జాక్ బెల్డెన్ రాసిన "ప్రపంచాన్ని ఊపేసిన చైనా" (China shakes the world) లోనిది. ఎడ్గార్ స్నో తన చైనా అనుభవాలను అనేక పుస్తకాలలో క్రోడీకరించాడు. జాక్ బెల్డెన్ చైనా అంతర్యుద్ధపు ఆఖరి దశ (1948-1949) లో చైనా అంతా విస్తృతంగా పర్యటించాడు. ముఖ్యంగా గ్రామసీమల్లో తిరిగాడు. తను విన్నవీ, కన్నవీ వీలైనంతవరకు తన అభిప్రాయాలు చొప్పించకుండా గ్రంథస్థం చేశాడు. అతను ఒకసారి ఒక గ్రామం నుంచి మరో గ్రామం వెళ్తుండగా విన్న కథ ఇది. అప్పటికి చైనాలో చాలా భాగం ప్రజాప్రభుత్వం అధీనంలోకి వచ్చింది.)

నాతోపాటు వచ్చే అతను ఒక ప్రభుత్వ గుమాస్తా. అతను సరదాగా బండి ప్రక్కన పరుగెత్తుతూ గుర్రాలను హుషారు చేస్తున్నాడు "టుర్...టుర్ . ఛోఛో" పదహే అంటున్నాడు. గబుక్కున ఎగిరి బండిలోనే అతని ప్రక్కన కూర్చున్నాడు. అతను చర్నాకోలతోను, బండతను చిన్న కర్రపుల్లతోను గుర్రాలను తోలుతున్నారు. వాలుగా ఉన్నరోడ్డుమీద గుర్రపు బండి మంచివేగంగా పోతోంది. పరుగెత్తుతున్న గుర్రాలను నీలాకాశాన్నిచూస్తూ బండి చేసే కిర కిర శబ్దాలను వింటుంటే ఏ క్షణానైనా ఈ భూమిని వదిలి ఆకాశంలోకి వెళ్ళిపోతామేమో ననిపించిదినాకు.

"మాంచి గుర్రాలజత" అన్నాను. బండితోలే అతన్తో అతడు ఈ చెరేపనుంచి ఆ చెంప వరకు ఇకిలిస్తూ "ఫర్వాలేదు...కాని యుద్ధానికి ముందు నాకో గుర్రం ఉండేది. దానంత మంచివికావు, అదా? అది పులిలాగా కొండను ఎక్కేది. చేపలాగా నీళ్ళల్లో ఈదేది. మీరు నమ్మరుగాని అది పరుగెత్తుతూంటే ఎవరికైనా ఊపిరి ఆగిపోయేది. అది రోజుకు 50 మైళ్లు పోయేది. ఒక్కసారి కాదు అనేకసార్లు. అయితే ఒక్క తప్పుండేది దాన్దగ్గర. తెగతినేది. దానికి మేతేస్తుంటే అదేదో రైలింజనులో బొగ్గేసి నట్టుండేది... ఏం గుర్రంలే ..ప్చ్. అది చచ్చిందీ నేను గుర్రపుమాంసం మానేశాను. మనిషని సమాధిచేసినట్టే చేశాననుకో. పదిహేడేళ్ళపాటు బతికింది. ఏంగట్టిగా ఉండే దిలే అని గుర్రాలనదిలించాడు.

"మరి నీ ఆరోగ్యమో ముసలయ్యా" అని అడిగాను. ఆరోగ్యంతోను,' బలంతోను తొణికిసలాడుతున్న ఆ వృద్ధుడు చిరునవ్వు నవ్వాడు. "నా ఆరోగ్యమా! ధోకా లేదు. ఎట్లాఉంటదీ... ఎందుకుంటదీ? తినా మొయ్యా వస్తోంది. సర్కారు నాకు

సంవత్సరానికి నూరు కాటీల(130 పౌన్లు)తవిడలు ఇస్తోంది. మా తమ్ముడు చిక్కుళ్లు పండిస్తాడు. నా పెళ్ళాము, చెల్లి బట్టలు నేస్తారు. మాకు బాగానే జరుగుతోంది. నీకు తెలుసో లేదోగాని సంవత్సరాదినాడు మేము పందిమాంసం తిన్నామయ్యా... అదీబాగా తిన్నాం.".

"మీరు బహుశా బుగతమాంసంకూడా తింటారేమో"అని ఒక కమ్యూనిస్టు నినాదాన్ని గుర్తుతెస్తూ అన్నాను. "కామ్రేడ్ మీరు వింతగా మాట్లాడుతున్నారే"బండితోలే అతను కొరడా మోకాళ్ళమీదపెట్టి చేతితొడుగులు తీసి మూతి తుడుచుకున్నాడు. అతనిని అవమానించినట్టుగా కోపం తెచ్చుకున్నాడు "నేను ఎవరిమాంసమూ తినలేదు. కాని బుగత మాంసం రుచిచూసినవాళ్ళులేరని చెప్పననుకో... ఆఁ " అన్నాడు అతను. ఉహూ(అలాగా... ఆసక్తిగా అన్నాను. అతను చెకుముకికొట్టి సిగరెట్టు అంటించుకునేవరకూ ఆగాను.

"బుగతమాంసాన్ని వాళ్ళెలా తిన్నారు?"అని అడిగాను. "చూడండి...అసలు బుగతలే ముందుగా జనం మాంసం తింటారు. ఇవ్వాళ ఆదిరోజైతే రేపు మారోజు. పెర్సిమ్మాన్‌లోయ గ్రామాన్నే తీసుకోండి. అక్కడ మూషియన్ అనే భూస్వామి ఉండేవాడు. జనాన్ని వాడు పెట్టిన తిప్పలు మోరకలిగా ఉండేయనుకోండి. వాడు కొమింటాంగ్‌లో సభ్యుడు. జపాన్ భూతాలు దాడిచేసినప్పుడు సమష్టి రక్షణదళాల్లోకి మనుషుల్ని చేర్పించేవాడు. జపాన్ వాళ్ళతోను, ఎనిమిదో దళం దోపిడీదార్లతోను పోట్లాడానికని చెప్పేవాడు. కాని వాడు తొందర్లోనే జపాన్‌వాళ్ళకు లొంగిపోయాడు. ఇక గెరిల్లాల కుటుంబాలదగ్గరకు పోయి వాళ్ళబ్బాయిల్ని, యిళ్ళకు పిలిపించమనేవాడు. "లేకపోతే జపాన్‌వాళ్ళు మిమ్మల్ని చంపేస్తారు" అనేవాడుకూడా. తిరిగి వచ్చినవాళ్ళకేమీ ఆపదజరక్కుండా చూస్తానని హామీకూడా ఇచ్చాడు. ఎనిమిదో సైన్యానికిచెందిన ఒక దళనాయకుడు వస్తే చంపేసాడు. సంతాపసభ పెట్టాడు. వాడికి రెండుముఖాలు, రెండు నాలికలు. దాంతర్వాత ఏ సైనికుడూ తిరిగిరాలేదు. అందుకని గెరిల్లాల దగ్గర బంధువులను చంపేవాడు. అక్కడున్న నూరుకుటుంబాల్లోను ఎవరో ఒకరిని చంపించాడు. జపాన్ గెలుస్తున్నప్పుడు వేలాదిమందిని పోగుచేసి మాచేత రాళ్ళు మోయించి జపాన్‌వాళ్ళకు యిల్లు కట్టించాడు. ఆ యింటి ప్రతి రాతికి మా రక్తం అంటుకుంది. తానేదో దేవుడైనట్లు అందరి ప్రాణాలనూ చులాగ్గా చూసేవాడు. ఒకనాటి రాత్రి మా పేదరైతుల్లో ఒకడు అతను సైన్యంలో ఉండేవాడు ఊళ్ళోకి వచ్చాడు తన భార్యను చూచుకుందామని. ఆమెపేరు "మూడో మొగ్గ". తెల్లారేటప్పటికి వెళ్ళిపోతాడని తెలుసుగదా ! అందుకని భర్తను గదిలోకి తీసుకువెళ్ళింది. అతనొచ్చాడని మాకందరికీ తెలుసు. మేమెవరమూ 'మూ'గాడికి చెప్పలేదు. గ్రామ మున్సబు వెళ్ళి



భూస్వామికి చెప్పాడు ఆ దుర్మార్గుడు"మూ"గాడు వెంటనే పోయి భార్యపక్కలోంచి ఆ సైనికుణ్ని బరాబరా లాగి పందానికట్టినట్టుకట్టి తీసుకుపోయాడు. పాపం ఆ పిల్ల భర్తను వదిలిపెట్టమని మూషియన్‌ను బతిమాలింది. పాపం చాలా బీదదేమో! ఎవరూ సహాయపడలేదేహే అమ్మాయికి. గజ గజ వణుకుతూ ఖైదుదగ్గరకు వెళ్ళింది. "మా ఆయన్నొక్కసారి చూడనిస్తారూ"అనడిగింది. "వీధిలోకివెళ్ళితే చూడొచ్చు" అన్నాడా కుక్కవెధవ మూషియన్. ఆ పిల్లేమో తన మొగుణ్ని వదిలిపెట్టరేమోననుకుంది. వీధిలోకి వచ్చింది తన భర్తను చూసినమాట నిజమే ఎక్కడా? ఘా రక్తమోడ్చకట్టిన రక్షణ దుర్గంగోడమీద, స్తంభానికి వేళ్ళాడుతోంది ఆ శిరస్సు నెత్తురు చారికలతో వెళ్ళుకొచ్చిన కళ్ళతో ఉన్న శిరస్సది పిచ్చి...పిచ్చెక్కిందాపిల్లకు. ఆ గోడ ఎక్కడానికి ఎగబాకింది. ఆ శిరస్సును తెచ్చుకుందామని ఎంతో ప్రయత్నంచేసింది. అందరూకలిసి ఆ పిల్లను లాగి ఇంటిదగ్గర వదిలారు. ఆ రేత్రి వానపడింది అతని తలకాయ రోడ్డుమీదపడింది. ఆ మర్నాడు పొద్దున్నే కాకులుకూసేవేళకే ఆమె బయటకువెళ్ళింది తన భర్త తలను చూసుకుంది ఇంటికితెచ్చుకుంది. మూడురాత్రుళ్ళూ మూడుపగళ్ళూ ఆ తలకాయను పక్కలోపెట్టుకొని కాంగ్, (మన అరుగులాంటిది. లోపలి డొల్లగాఉంటుంది. వెచ్చగా ఉండడంకోసం, లోపల కట్టెలు, బొగ్గులతో కాలుతూ ఉంటాయి) మీదనే ఉండిపోయింది. ఆ తలకాయను ముద్దులేపెట్టిందా! ముద్దు చేసిందా? నిజంగా బతికిఉన్నతలతో చేసేపనులన్నీ చేసింది. పెద్దపులిలాగా, పిల్లల కుక్కలాగా, దగ్గరకెవర్నీ చేరనీయలేదు మేము చేసిందికావి, చెప్పిందికాని ఆ పిల్ల ఖాతర్రికెక్కలేదు. ఒక్క నిముషంకూడా ఆ తలకాయను వదిలిపెట్టలేదు" బండితోలేవాడు కథచెప్పడం ఆపాడు. చేతితొడుగు తగిలించుకుని కొరడా తీసుకున్నాడు గుర్రాల నదిలించాడు రౌద్రంతో ఇలాచెప్పాడు.

"అది ప్రజలకవమానంకాదూ? అది వాళ్ళ మాంసాన్ని తిన్నట్టుకాదూ"

"మీరు, అతనిమాంసం తిన్నారుగా?" అన్నాడు కథ సగంమధ్యలో బండిమీదికి వచ్చిన గుమాస్తా. బండితోలే అతను మళ్ళీప్రారంభించాడు "ఆ ద్రోహి విషయం నాకు బాగాగుర్తు... వాడిమీద 400 పైన ఆరోపణలు వచ్చినయి. వాడి సంగతితేల్చే సభకు పర్కానుంచి 20 వేలమంది వచ్చారు. చాలమంది ఆడవాళ్ళు రావాలనుకుని రాలేకపోయారు. వాడిని ఊళ్ళమీదుగా తీసుకువచ్చారు. ఆ రకంగా వాడిమీద కసితీర్చుకుంటానికి అందరికీ అదునుకల్పించారు. ఆ పాదయాత్రి నేనెప్పుడూ మర్చిపోలేను. అప్పుడు రక్షకదళంలో ఉండేవాడిని. మొదటి ఊరు దగ్గరపడగానే నేను ముందుగా ఊళ్ళోకివెళ్ళాను నాయనా. ఆ ద్రోహి మొదటి ఇంటిదగ్గరకు వచ్చాడో లేదో అప్పటికే జనం గుంపులు గుంపులుగా కర్రిలూ కత్తులూ, పలుగూ పార ఒకటేమిటి చేతికిదొరికిందల్లా పట్టుకుని వాడిమీద పడ్డారు. ఒకామె కత్తెర పట్టుకొచ్చింది" 'నేనా ద్రోహి

మాంసం తింటాను అని అరిచింది. యువజనదళంవాళ్ళు అంతజనమూ వాణ్ని సభాస్థలానికి చేరకుండానే ఎక్కడచంపేస్తారోనని భయపడ్డారు. అందుకని వాణ్ని, ఎంతైనా కొట్టొచ్చుగాని చంపకూడదు అని రూల్ పెట్టేశారు.

ఊరి తర్వాత ఊరు...అలా వాణ్ణి ఇరవై ఊళ్ళుతిప్పారు. క్రోధంతో ఉడికిపోతున్న జనం వాడికి తిట్లూ దీవనలతో స్వాగతంచెప్పారు. యువజన సంఘంవాళ్ళ రూల్ మూలాన రైతుకూలీలచేతుల్లో కర్రలులేకుండా పోయినయి. అయినా ఒట్టి చేతుల్తోనే వాణ్ణి చంపినంత పనిచేసారు. వాళ్ళదగ్గర కత్తిపీటలున్నాయి. "నాలుగుతులాల మాంసమివ్వండి... నాలుగుచాలు"అని బతిమాల్తారు. వాళ్ళను అపడానికి మాకు తల ప్రాణం తోకకు వచ్చింది.

మొదట్లో "మూ" గాడు దెబ్బలు తట్టుకున్నాడు. కాని రాను రాను వాడి ఓపిక చచ్చిపోయింది. మరీ ఒక వూళ్ళో పసిపిల్లవాడిలాగా ఏడ్చాడు. వాడి ముఖమంతా నెత్తురూ, చెమటా ధారలు కట్టింది.

"నేను ఎనిమిదేళ్ళపాటు మీకోసం పని చేసాను......నాకొక్కడూ మిత్రుడు లేడా?...నా ముఖం తుడుచుకుంటాని ఒక్క జేబు గుడ్డ" ఎవరన్నా ఇవ్వరా?...... బాగా మురికి పట్టిన జేబు గుడ్డ...ఏదైనా పర్వాలేదు "అని ఎలుగెత్తాడు వాడి గొంతు వింటుంటే మండి పోయిందినాకు. అది దయనీయమైన పసి గొంతుక. వేటలో లేడిలాగా వాడు చుట్టూ చూస్తున్నాడు. బహుశా ఎవడైనా స్నేహితుడి ముఖం కనబడుతుందని అయివుంటుంది. "ఒక చిన్నగుడ్డముక్క ఒక చింపిరిగుడ్డైనా సరిపోతుంది" పసివాడు కొబ్బరి సంజుకోసం బతిమాలినట్టు అడిగాడు. కాని ఆడాళ్లు మొగాళ్లు అట్టాగే నుంచున్నారు. వాడిమీద మండిపోయారు. అయితే "గుర్రపుస్వారీ గుడ్డ ఇవ్వండిరా!"అని ఎవరో అరిచారు. అందరూ ఒక్కసారి గొల్లుమని నవ్వారు. వారు మూ గాడిమీదపడి పిడికిళ్ళతో కొట్టారు. "గట్టిగా కొట్టొద్దో వాడు బతికుండగానే సభాస్థలానికి చేరాలి" అని అరిచాను. అరిచానేగాని వాణ్ని వాళ్ళ మధ్య నుంచి యీడ్చుకుని పోవడం చాల కష్టమైంది. ఒకామెఐతే వాడి ముఖమంతా రక్కుతూ ఊరిబైబటాకా వచ్చింది.

అన్ని ఊళ్లూ వాణ్ణి చూచింతర్వాత సభాస్థలానికి చేరుకున్నాం. ఆ స్థలం ఒక దేవదారువనం దగ్గరగా వుంది. ఆ సభాస్థలానికి ఆనుకున్న గోడలమీద వాటి చరిత్ర అంతా బొమ్మల్తో చిత్రించారు. వాడు చంపిన వాళ్ళందరిపేర్లూ కాగితాలమీద రాసి దేవదారుచెట్లకు వేళ్లాడగట్టారు. ఆరోజునే ద్రోహి మూ షియాన్‌ను ఉరితీస్తారని ప్రభుత్వం ప్రకటించింది. నేను చెప్పానుకదా ఇరవై వేల మంది ఆ ద్రోహిని వేదిక మీదకు తీసుకువచ్చాము. వెంటనే పదిమంది మనుషులు వాడిమీదకు వచ్చారు. "నువ్వు నా బిడ్డను చంపావు" అన్నాడొకడు. అతడిని తోసి ఇంకొకడు "వాడితో మాట్లాడతా వెంటయ్యా... కాదు! అవును... అవును మాట్లాడొద్దు... బాదండి" అని కొన్ని వందల గొంతులు అరిచినయి. అరుస్తూనే ఆ గుంపంతా వేదికమీదకు తోసుకువచ్చింది అధ్యక్షుడు లేచి నిశ్శబ్దంగా ఉండమని చేసైగ చేసాడు– "మనమంతా క్రమశిక్షణతో ప్రవర్తించాలి. వరుసగా ఒకరితర్వాత ఒకరం కొడదాం" అన్నాడాయన.

మొదటి దళంలో ఏడెనమండుగురున్నారు. కాని మిగతావాళ్ళుకూడ వేదిక మీదకు వచ్చి బాకుల్తోను, కత్తుల్తోను వాణ్ని పొడుస్తూనే వున్నారు. నేను క్రింద మొదటివరసలో వున్నాను. "వాణ్ని చంపొద్దు మేముకూడా కొట్టాలి" అని ప్రతివాడు అరుస్తున్నాడు. ప్రతివాడూ నన్ను ముందుకు తోస్తున్నట్టనిపించింది. అందరూ వేదిక వైపు సాగిపోతున్నారు. "అయ్యో...అది..." అని ఆపాడు గుమాస్తా.

"మూడోమొగ్గ సంగతి మరిచిపోయావే..." అన్నాడు బండితోలేవాడు–

"నువ్వు నన్నెరగవుకానీ...నేనూ ఉండానాసభలో... నేను బుగతగాడిమాంసం తినను. ఆ మాటకొస్తే ఎవడి మాంసమూ తినను. కాని నేనాసభలో ఉన్నాను. జరిగింది తా చూశాను. ఆరోజున మూడో మొగ్గను మాత్రం ఎప్పుడూ మర్చిపోను. ఆమె 30 లీలదూరం నడిచి ఆ సభకొచ్చింది. అంతకిత్రం రాత్రికూడ నడుస్తూనే వుంది. అంతకుముందు ఆ పిల్ల ఎంత వినయంగా సిగ్గుగా ఉండేదో! ఇల్లొదిలి బయటికి వెళ్లేదా! కాని ఆ రోజున... అమ్మో! ఏం మనిషి... ఇంకా కళ్ళకు కట్టినట్టుంది. వేదికమీదకు మూషియాన్ ముందు ఎలా వెళ్ళిందనీ!"

"ఒరే ద్రోహి! మూ! ఎట్టా వున్నావురా"అని అడిగింది. ఆమెను చూడగానే జనంలో సద్దుమణిగింది. ప్రతివాడికీ ఆ పిల్ల కథ తెలుసు. ఆ నిశ్శబ్దంలో, వాడి సమాధానం మా అందరికీ వినబడింది.

"చూస్తున్నావుగా... దారుణంగా ఉన్నాను" అన్నాడు. ఆమె గుటకలుమింగుతోంది. ఎదుర్రొమ్ము చేతుల్తో పట్టుకుంది. ఆమె గుస గుసలాడినంత నెమ్మదిగా మాట్లాడింది. కాని జనమందరికీ వినబడింది "చెప్పు...ఈ జనానికి చెప్పు... జపాన్ వ్యతిరేక దళసభ్యుణ్ని ఒకతన్ని... నా భర్తని ఎలా చంపావో చెప్పు" అంది.

"లేదు... అతన్ని నేను చంపలేదు" అన్నాడు.

మూడోమొగ్గ గొంతు పెంచి: "అయితే ఎవరు అతన్ని ఈ లోకంలో లేకుండా చేసింది" అని అడిగింది.

"జపాను వాళ్ళు"

"నువ్వు... నువ్వే చంపావు"

నడుంమీద నుంచి పటకా తీసింది. ఆ ద్రోహిని పటపటా కొట్టింది. అంత బొబ్బరింతలు

నేనెప్పుడూ వినలేదు ఆమెపటకా వాడిమీద పడ్డప్పుడల్లా "కొట్టు...కొట్టు అని ప్రజలు అరుస్తున్నారు. నేనుకూడ నాకు తెలవకుండానే అరిచాను. ఆపిల్ల ప్రతీకారం తీర్చు కుంటుంటే— అబ్బ... ఎంత బాగుందీ... మూషియన్‌గాడు మోకాళ్ళమీద కూలబడే దాకా కొట్టింది...... ఆహా!... అది నేనెప్పుడూ మరిచిపోను" బండతను తల పంకించాడు "నేనా... నేను బుగతగాడి మాంసం తినను...కాని మాదో మొగ్గ అన్నా వా... అందుకు కారణాలున్నాయిగా!"

అతను బండిమీదనుంచి దూకి గుర్రాల పక్కగా నడుస్తున్నాడు. "సరే! ఇ త సభ ఎలా ముగిసింది" అని గుమాస్తానడిగాను.

"సరే... ఆ పిల్ల కొట్టింతర్వాత ఇంకా చాల మంది వేదిక మీదకువెళ్ళారు. వాణ్ణి తుక్కుగా కొట్టారు. కింద పడ్డాడు. చచ్చినవాడిలాగా కదలకుండా పడి ఉన్నాడు ఆ సభ మూడు నాలుగ్గంటల పాటు జరిగినా వాణ్ణి నలభైమందే కొట్టారు. అధ్యక్షుడు కల్పించుకొని "ఎవరికైనా ఇతనిమీద తీవ్రమైన ద్వేషముంటే లేచి నుంచోవచ్చు" అన్నాడాయన. 501 మంది లేచినుంచున్నారు. సభను అదుపులో ఉంచడం కష్టమైంది. ప్రతివాడు వేదికవైపు రావడానికి ప్రయత్నిస్తున్నాడు. అక్కడున్న కార్యకర్తలకు ఆ పద్ధతి నచ్చలేదు. మూగాడిని పొలాల్లోకి తీసుకువెళ్ళి కాల్చేసారు. అతని శవాన్ని వాళ్ళ కుటుంబానికి అందచేసారు. ఆ శవాన్ని గడ్డితడికలతో కప్పారు. జనానికీసంగతి తెలిసి ఆ శవాన్ని లాక్కుపోయారు. గడ్డి తడికలను పీలికలుచేసి శవాన్ని కట్టెలతో కర్రలతో బాదారు. ఒక కుర్రాడు ఆ శవాన్ని బల్లెంతో 18 సార్లు పొడిచాడు. "మా నాన్నను 18 సార్లు పొడిచావు నేను నిన్నూ అలాగే పొడుస్తాను" అని అరిచాడతడు. చివరికి వాడి తలను మొండెం నుంచి వేరుచేసారు. కొన్ని రోజుల్దాకా ఆ పొలంలో ఆ శవాన్ని చూడ్డానికి జనం వస్తూనే ఉన్నారు. "పూర్వం నువ్వు సైన్యాధిపతిగా ఉన్న ప్పుడు అనేకమంది నిన్ను చూడ్డానికొచ్చేవారు. ఇప్పుడు చచ్చికూడా నిన్ను చూడ్డానికి అంతకంటె ఎక్కువమందిని వచ్చేట్టుచేసుకున్నావు" అని అన్నారెవరో వాడిశవంతో .." గుమాస్తా కథ పూర్తిచేసాడు నాలికతో శబ్దం చేసాడు.

"దుర్మార్గం కదూ" అన్నాడు.

బండతను పక్కన నడుస్తూనే "దుర్మార్గమా? తన చుట్టుపక్కల వాళ్ళను వందమందిని పొట్టనపెట్టుకున్నవాణ్ణి చంపడంలో దుర్మార్గమేముందీ? నేనైతే ఎవర్నీ చంపలేననుకో... కాని మన ప్రజల్ని ఎలా తప్పుపడతావు? భూస్వాములంతా మన బతుకులతో చెర్లాటలాడిన వాళ్లే... దుర్మార్గులే... మరి మనం చంపింది వాణ్ణొకణ్ణే. మిగతా వాళ్ళంతా మనలాగే బతుకుతున్నారు. దుర్మార్గమంట... అబ్బ ఏం మాటన్నా వండీ" అన్నాడు.

(అనువాదం: రహీ)

# శిక్షా పత్రం

అద్రి

"యక పిల్లెంకదో! ఒక్కేటుకి తల తెగి రక్తం గంగమ్మోరిలా గోతిలో పడకపోయిందో— చూస్కో— యక నీ పుచ్చె లెగిసిపోద్ది..."

"యాడాదికితం నాయుడయ్య అన్న మాటలు తను మర్చిపోలేదు. అంగో... అడ... మూల్రాయిమీన ఓ కాలేసి ఎడంసేత్తో పొన్నుగర్రఊపుతా, కుడిసేత్తో మీసం మెలేసుకుంటా నిలబడిండు నాయుడయ్య. నాయుడయ్యకి కూసింత ఎడంగా, కట్టుగొయ్యకి జీవాన్నికట్టేసి తను ఇంగో— కరట్టుగా ఈడనే నిలబడింది—

పెతి సంవచ్చరం నాగే నిరుడుగూడా— కార్తీగ పున్నం నాడు పెదశేలో నాయుడయ్య జీవాన్ని బలియ్యాలనుకున్నడు— తను నాయుడయ్య కొలువులో కుదిరిన ఏడేళ్ళ నుండీ అట్టా బలిస్తనే ఉన్నడు! అప్పట్లో నాయుడయ్యంటే తనకెంతగురో: కార్తీగ పున్నం పదేన్రోజులుందనగానే తన సంబరానికి పట్టపగ్గాలుండేయి కాదు. ఆ సుట్టుపట్ల ఊళ్ళన్నీ గాలించి, బాగా బలిసిన గొర్రెను తోలకరావడం దగ్గర్నుంచి, ఆ పదేన్రోజులు దాన్ని కడుపునిండా మేపటం, పొద్దున్నే శెత్తగడ్డితో వొళ్లుతోమి కుంకం, పసుపూ మొగాన పెట్టటం దగ్గర్నుంచి— ఆకరుకి పున్నంరోజున పెదశేలో దాని తల ఒక్కేటుకు తెగెయ్యటందాకా తనే సూసుకునేవోడు— ఎనిమిదేళ్ళ కితం ఒక సాములోరు సెప్పిండంట, ఈ తలంలో లంకెలబిందెలుండయ్యనీ, అయి బయటకొచ్చి శేతిలోపడాలంటే, అయ్యొచ్చేదాకా పెతేడూ కార్తీక పున్నంనాడు జీవాన్ని బలెయ్యాలని."

కాళ్ళకు ఏదో అడ్డం పడి, పాదాలకు బంధం పడినట్లనిపించడంతో ఎంకడు కిందకు ఒంగి పరీక్షగా చూశాడు, ఆ చీకటిలో— చేతులతో ఆ వస్తువును తడిమిచూశాడు.

"మెడ పలుపు— కొత్త పలుపుతాడు. ఇంకా గోగునార మురుగువాసనగూడా పోలేదట్టుంది— ఇయ్యాల తనకు బదులు మరొకడెవురో తెగ్గేసుంటడు. ఇంగో! ఇదే కట్టుగొయ్య ఎనిమిదేళ్ళనుండీ! ఈ శేతులతో ఇప్పటికి ఏడు జీవాల పేణాల్ని తీసిండు. పోయినేడు మాత్రం యాడా సరైంది దొరక్క, పొదుగొదలని లేతముండని తీసుకు రావాల్సివచ్చె—

ఈ కట్టుమట్టకే కట్టేసినా— అది సూసిన సూపులు గుర్తుకొత్తే, ఇప్పుడికూడా కడుపులో దేవినట్టుంటంది.

ఈ పసిపిల్లను దేనికి తెస్తినా్రి బగమంతుడా అనుకున్నాడు తను. మూర్తం దగ్గరపడుతున్నకొద్దీ ఎన్నడూ లేంది ఆయాల కాల్లూ శేతులూ సల్లబడ్డంకు- నాయుడయ్యకోసం తన్జేసిన పాపప్పన్లలో, చూసుకుంటే ఇది అసలు లెక్కలోకేరాదు. తనకి ఓటెయ్యలేదని 'గవరప్ప' గుడిసె తగలబెట్టిరమ్మంటే సులాగ్గా రేత్తిరిరేత్తిరే తగలబెట్టిండు.

పోరంబోకు పొలం తగాదాలో తనకే ఎగెనెట్టుగా సాచ్చంచెప్పింగు- పగతీరును కోవాలని నాయుడయ్యా అగ్గిలాగైతే, తనూ గుగ్గిలమైపోయిండు- అమాస్సీకల్లో- తుమ్మల శెరువుకాడ, మూడోకంటికి తెలవకుండా "మునెయ్య"ను నంపిండు.

ఇయ్యన్నీ ఒకెత్తు... తను నాయుడయ్యకోసం రేత్తుర్లు సేసినవన్లు ఒకెత్తు... పాపం- ఎంతమంది ఆడంగులో- కొత్త గావచ్చిన 'నప్పు' తన్లేకపోతే, నాయుడయ్యకు సిక్కేడా? ఆ రేత్తిరి ఊరుకు వెలపలగా ఉన్న "తోట బంగళా"లో ఆయమ్మ దిక్కు-తోసక- పాపం- ఎంత లబలబలాడిందో- ఇట్టా నాయుడయ్యకు తనెంతమందిని తార్సిందో—

అట్టాంటోడ్ని, ఆయాల శేతిలో మేదరకత్తి పట్టుకుని తటపటాయిస్తుంటే, నాయుడయ్యా ఉగ్గింగా సూశిండు ఐనా ఈ తూరి తనోల్లగాదనిపిచ్చింది.

"దొరా! తప్పుకాయండి! నాకెందుకో సెయ్ రావడంలేదన్నడు తను శేతులు ఒణుకుతుంటే-

మరింగంతే! నాయుడయ్యా గుగ్గిలమైపోయిండు-" దొంగలంబ్డికొడకా! కుభంపల కరా మంకాళంటే- పెళ్ళికూతురు ముండా అన్నడంట ఎనకటికెవుడో! తీరాజేసి మూర్తం దగ్గరపడినతర్వాత సెప్తే ఎట్లా? ఐనా పెతిసారీ లేనిరోగం ఇయ్యాలేం వచ్చింది? యక- ఈ నసుగుళ్ళం కుదరవ్- కత్తి తీసుకుని పనిపూర్తి చేశావా సరేసరి- లేకపోతే- యక చూస్కో ఈ నాయుడయ్యా తడాఖా...!" అంటా ఎగిరిపడ్డడు-

"అప్పుడ్నయితే ఇనుకున్నడుగాని ఇప్పుడ్నయితేనా-" ఎంకడి చేతివేళ్ళు కత్తి పిడిమీద బలంగా బిగుసుకున్నాయ్.

"ఆకరికి దిక్కు-తోసక మనసులో బగమంతుడ్ని తలుసుకున్నడు- ఉన్నట్టుండి ఎడంకన్ను టక్కున అదిరింది.

రెండుశేతులతో కత్తిపట్టుకుని- బారెత్తి- ఒక్కొ-ఒక ఏటు-

కత్తి మెడమీదపట్టం- గొట్టెపిల్ల అట్టా అరుత్తుండగానే, తల సగానికితెగి, అయ్యిన రగతం తన గుడ్డలమీదకి సిమ్మడం-"



గడచిన అనుభవాలు గుర్తుకు రావడంతో, ఒళ్ళు జలదరించి- ఆ భీభత్సదళను భరించలేక కళ్ళుమూసుకున్నాడు ఎంకడు- మళ్ళా ఏదో గుర్తుకువచ్చి, గోతిదగ్గరకు వెళ్ళి తొంగిచూశాడు- ఆ మసగవెలుగులో- ఆ ఉదయమే తీసిన గోతిలో పచ్చి మట్టిమీద- రెండడుగుల వైశాల్యం మేరపరచుకుని, పెచ్చులు పెచ్చులుగా కట్టిన రక్తం గుర్తులు కన్పించాయి ఎంకడికి- "రగతం- రగతం" ఆయాలా ఇంతే- తన్జేసిన పాపాలెందుకో అప్పుడు గుర్తుకొచ్చినయ్- ఆ పసిజీవం "అమ్మా"అని ఆకరున అరిసిన అరుపు ఇన్లేక ఇట్టగే నిరుడూ కళ్ళుమూసుకున్నడు-

నా తల్లి- సివంగిగూడ ఇట్టగే లబలబలాడుంటది.

సివంగిని తల్చుకునేసరికి, ఎంకడిమొహం "పగ"తో ఎర్రగా కందిపోయింది- పండ్లు పటపటలాడాయ్- మళ్ళ గతస్మృతులు వేటకుక్కల్లా వెంటబడి తరిమినాయ్ ఎంకడిని.

సివంగి... ఆయాలే తన కూతురుబతుకు బండలైందని తనకి అప్పుడుగెయింపు లేకుండా పోయింది.

తపతప కొట్టుకుంటున్న జీవాన్ని సూడలేక తనింకా అట్టగే కళ్లు మూసుకుని నిలబడిండు.

'పిల్లెంకడొరేయ్! ఏందిరా నీ యవ్వ! ఇందాకట్నుంచీ పొలికేకలు పెడతంటే చెవుల్లో సీసంగాని ఉందేటి? అద్సరేగాని- అదుగో అటు సూడు- ఆ గట్టుమీదపోయే 'గుంట' ఎవరూ?' అన్నడు ఆత్రంగా.

అప్పుడిదాకా లెక్కలేనంతమంది ఆడంగుల్ని తార్సిన తనకి- అప్పుడు మటుకు అనిపిచ్చిందెందుకో- 'మళ్ళీ ఎవురికో మూడినాదన్నమాట' అని. 'యక గుడ్లప్పగించి చూస్తావేందిరా? ఎవురదంటే మాట్లాడవేం?' అని గదమాయించిండు.

గట్టుమీదకి సూత్తానే తనకి నాలక పిడసగట్టకపోనాది.

మరేంసెయ్యడానికి పాలుపోలే తనకి. మళ్ళీ ఎడమకన్ను తప్పున అదిరింది- ఏటిసేస్తడు తనప్పుడు-

"దొరా! అది నా కూతురు సివంగి!" అన్నడు తను భయం భయంగా.

"ఓర్నీయవ్వ! నీకు యీపాటి దీటైన కుట్టది ఉన్నదని సెప్పనేలేదేందిరా నాయాలా!" అన్నడు ఇనప నవ్వు నవ్వుతా!

తన గుండెల్లో ఆయాలే బండపడ్డది.

"సిత్తం! అది మొన్నటిదాకా దాని మేనత్తవ్వదగ్గరుండి నిన్ననే వచ్చినాది-

మనువుకూడా కుదిరినాది– మాగ మాసం లగ్గానికి సేద్దామని!" మరింకేం మాట్లాడలేక పోయిండు తను.

"ఏందిరా పిచ్చోడా! బంగారంలాంటి పిల్లకు అప్పుడే పెళ్ళేంది!" అన్నడు మళ్ళీ అట్టగే ఇసపు నవ్వు నవ్వుతా"–

దాపులో వున్న గడ్డివాము మీదనుండి ఏదో పక్షి తప తప రెక్కలల్లార్చుతుంటూ వెళ్ళిపోయింది.

తలెత్తి ఆకాశంకేసి చూశాడు ఎంకడు–

"అప్పుడ్నే విదేశ్రిలయినట్టుంది– పున్నంనాడు ఎన్నెల ఇరగ్గాస్తది– ఇయ్యాల మబ్బుపట్టినాది– పోయినేడూ యింతే– ఒకేల వోనొత్తదని నాయుడయ్య ఇయ్యాల రాడేమో! అహఁ...అట్టగాదు– పిడుగులుపడ్డా ఎప్పుడ్నాగే ఈయాల ఈడ పందుకోడా నికి వత్తడు నాయుడయ్య–"

కత్తిని భుజంమీదకు మార్చుకుని గడ్డివాముపైపు నడిచాడు ఎంకడు. జమ్మి చెట్టు మొదలుకానుకుని కూర్చుంటూ బొడ్లోనుండి లంకపొగాకుతీసి పాయపొరతీశాడు.

"లంకపొగాకు తనకెంత పేణమో! అప్పుడుమాత్రం అనుంతాగుతున్నట్టుంది– ఐనా తాగుతున్నాడు. ఇంకెంత సేపులే– ఎన్నడూలేంది ఆర్నెల్లకితం కుష్టానదిలో ఉంది లంకలో యగసాయం సేయించటానికి తననే ఎందుకుపంపిండో అప్పుడు అంతబాగా అంతుబట్టక పోయింది–

సివంగి– గోమాలచ్చింలాంటి బిడ్డ. అచ్చం సివంగినాగే ఉండేదనేవోరు వాడ కట్టోల్లంతా! దానమ్మ సచ్చిపోయిన్నాట్నుంచి పాణంగా పెంచుకున్నడు దాన్ని. పెంచ పాకాలా దానిమీదే ఎట్టుకు బతికిండు తను– చివరికిట్టా అన్నాయంచేసి పొయ్యింది–!"

ఇంతలోకే మరేదో గుర్తుకువచ్చినట్లయి రౌద్రింగామారింది ఎంకడిమొహం.

హుఁ... అదన్నాయంసెయ్యడమేంది? అదు... అదు... ఆ నాయుడయ్య సేసిండు– నంజాకొడుకు–

నమ్మినబంటునాగా, వాడి కొల్వుసేత్తా, వాడు సెప్పినట్టల్లా యినుకుని ఎన్ని పాపప్పనులు సేసిండో–! ఏంజేసినా బిడ్డ 'సుకం'గా బతకాలనే సేసిండు తను–

అట్టాంటిది. ఇసోస్పం లేకుండా తన బిడ్డనే పొట్టన పెట్టుకున్నడు... అన్నెం పున్నెం ఎరగని బిడ్డ ఎంత లబలబ లాడిందో! తనను లంకకు బంపి దొంగెత్తు లాడిండు... ఆ పసువు ఆకలికి, అగ్గినాంటిపిల్ల బలై పోయినాది... తనకి మొగం సూపిచ్చటానికి మనసొప్పక– కిర్సనాలుపోసుకొని, నిప్పంటించుకుని సచ్చిపోనాదంట–"



నాలుగురోజులకిత్రితం లంకకు వచ్చిచెప్పిన సింహాద్రిమాట, "ఎఱ్ఱగాకాల్చిన ఇనుప కమ్మీలా ఎంకడి గుండెల్ని భగ్గున కాలుస్తోంది.

జమ్మిచెట్టు కొమ్మల్లోనుండి రెండు ఆకులు రాలి ఎంకడి తడికన్నులమీదుగా జారి పోయాయి.

ఇంతకాలం తనుచేసిన పాపాలు కళ్ళముందు గిరుర్రిన తిరిగాయి ఎంకడికి. గొత్తి పిల్ల "అమ్మా" అన్న ఆఖరి ఆర్తనాదం వాడి చెవుల్లో గింగురుమంటోంది. అన్యా యంగా తన మూలంగా నాయుడయ్య కామపిశాచానికి బలైపోయిన ఆడపడుచులు తనను శపిస్తున్నట్టుగా అన్పించింది ఎంకడికి.

"ఇన్నిటికీ కారణం నాయుడయ్యే– ఆడిమీన పగ తీరుసుకోకపోతే తన బిడ్డ తనని సెమించదు– అది సెమించినా, పగ సల్లారకుండా తను బతకలేడు– ఇంకా అడ్నట్టగే, ఈ బూమ్మీద బతకనిస్తే, ఇంకెంతమంది ఆడపడుసుల్ని కెరపడతాడో– రాచ్చసుడు– ఇంగా నాయుడయ్యరాడేం? కూడు తిని ఈపాటికొత్తా ఉండాల!"

కోపంతో, ఆవేశంతో ఎంకడి మొహం భీకరంగా మారింది. వీరభద్రుడిలా, కాటువేయ సిద్ధంగా ఉన్న కాలభుజంగంలా ఊగిపోతున్నాడు.

ఆ చీకట్లో– కత్తిని చంకలో ఉంచుకుని, జమ్మిచెట్టుకు ఎనగ్గా వెళ్ళి గడ్డివాము చాటుగా కూర్చున్నాడు గట్టుమీద దృష్టినిలిపి.

ఎక్కడా చీమ చిటుక్కుమన్న శబ్దంకూడా లేదు. ఉండీ, ఉడిగీ అక్కడొకటి అక్కడొకటి చెల్లాచెదరుగా నక్షత్రాలు మెరుస్తున్నాయి. అంత చీకట్లోనూ ఒక లకుముకిపిట్ట, జమ్మిచెట్టు పుచ్చిన బెరళ్ళను ఫొడుస్తో, ఆహారం కోసం తాపత్రయ పడుతున్నది.

ఎంకడు దీక్షగా గట్టుమీదే దృష్టినిల్పి కూర్చున్నాడు కత్తి పిడిని రెండుచేతులతో బలంగా పట్టుకుని.

"వోనగాని రాడుగదా! ఇంగియ్యాల నాయుడయ్య రాడేమో!" తీరని కసిలో కలిగే నిస్పృహతో లేవబోయినవాడల్లా దూరంగా అడుగుల శబ్దం విన్పడటంతో మళ్ళీ గడ్డివాములో నక్కి కూర్చున్నాడు ఎంకడు– టార్చిలైటి వెలుగులో గట్టుమీద రెండు ఆకారాలు వడివడిగా నడుస్తున్నయ్. టార్చిలైట్ వెలుగులో, పొన్నుగట్టున్న వెండి సింహం తల తళుక్కుమని కన్పించింది ఎంకడికి.

"ముందు మడిసి నాయుడయ్యే– మరి ఎనకున్న దెవురో!" మరి కొంచెం దీక్షగా చూశాడు. తలమీద నులకమంచం, పక్కబట్టలతో వెనకవస్తున్నది నారాయుడని గుర్తుపట్టాడు ఎంకడు.

"ఒకేళ నారాయుడుగూడ ఇక్కడ్నే వండుకుంటదేమో!" అన్న ఆలోచనతో మరైతే ఏం చెయ్యాలన్న ప్రశ్న ఎంకడి బుఱ్ఱలో కదిలింది

"అట్టగేంకాదులే. ఆరునూరైనా ఈ ఒక్కనాడూ, పెదశేలో ఒంటిగ్గానే పడుకుంటడు నాయుడయ్యా!" ఇంతలోకి ఏవో మాటలు విన్పించడంతో చెవులు నిగిడ్చి కూర్చున్నాడు ఎంకడు—

"వానగానొత్త దేమో దొరా! నానుగూడ ఇక్కడ్నే తొంగుందునేటి?" అన్నాడు నారాయుడు మంచాన్నిదింపి, చుట్టు గుడిసెపక్కన వాల్చి, తలగుడ్డతో మొహంతుడ్చుకుంటూ.

వాతావరణాన్నిచూసి, నాయుడయ్య సాలోచనగా కొంచెంసేపు మాట్లాడలేదు. "నువుతప్పు. రెండోమనిషి పున్నమిరాత్రి ఆ చుట్టుపట్ల ఉండకూడద"న్న సాములోరి మాట గుర్తుకువచ్చింది నాయుడయ్యకు.

"పర్వాలేదులేరా! నేనొక్కడ్నీ వండుకోటం అలవాటేలే. నువ్వుమాత్రం ఇంటికాడ కనిపెట్టుకుని ఉండు యక— కల్లుతాగి పోలేరమ్మగుడిదగ్గర పోర్లాడేవు! పల్లాపుపెయ్య ఇయ్యాల ఈనుద్దనుకుంటాను— పొద్దున్నే చిన్నెంకటిసామిగారింటికి పోయి దమ్మునాగలి తీసుకరావటం మర్చిపోమాక— ఇక ఇంటికిపో!" అన్నాడు నాయుడయ్య చుట్టను వెలిగించుకుంటూ.

నారాయుడు వెళ్ళిపోయినతర్వాత సాలోచనగా చుట్టకాలుస్తూ మంచంమీద కూర్చున్నాడు నాయుడయ్య. ఈ సుట్టుగుడిసెలోనే సివంగిని లొంగదీసుకున్నదన్న విషయం గుర్తుకువచ్చి, నాయుడయ్యచేయి గర్వంగా మీసాలను మెలివేసింది.

"ఒకవేళ ఈ ఇసయం ఎంకడి తెలిస్తే! ఇయ్యాలగాకపోతే— రేపైనా ఎట్టగైనా తెలుసుద్ది. ఐనా—వాడిమొగం— ఈలోగావాడ్నీ హరీయనిపిస్తే—"

ఎంకడు నాయుడయ్యను కనిపెడుతూ, పండ్లు పటపట నూరుతూ అలాగేకూర్చున్నాడు— మరొకసారి ఆకాశంకేసిచూశాడు— మబ్బులు కొంచెం విచ్చిపోయి, దరిదాపుగా నడినెత్తిన కనపడుతున్న 'గురకొయ్యల'కేసి చూశాడు— "ఇంగ పర్లేదు— మరో మడి సెపురూ ఇటురాడు" అనుకుని కత్తిని సిద్ధంగాపట్టుకుని చప్పుడుచెయ్యకుండా ముందుకు పాకాడు.

మౌనంగా ఆలోచిస్తూకూర్చున్న 'నాయుడయ్య' ఏదో స్ఫురించినట్లు ఉలిక్కిపడి లేచాడు— తనువొచ్చి అర్ధగంటైనా 'గోతి'కి దణ్ణంపెట్టలేదన్న సంగతి గుర్తుకొచ్చింది. లేచి వడివడిగా అడుగులువేస్తూ గోతికి దగ్గరగా నడిచాడు.



ఎంకడు మెల్లిగా గడ్డివాము పక్కనే నడుస్తూ నాయుడయ్యకు బార దూరంలో నిలచున్నాడు.

"నాయుడయ్యా!"

వెనకనుండి ఉరుములా కర్కశంగా వచ్చిన మాట విని, ఒంగి చేతిలోకి తీసుకున్న మట్టి జారిపోయింది నాయుడయ్య చేతుల్లోనుండి. భయంతో గుండెలు గుబగుబలాడిపోయాడు.

"ఎం...క...డూ...!" తడారిపోయిన గొంతులోనుండి మరోమాట రాలేదు. వికృతంగా, విరగబడి నవ్వాడు ఎంకడు—

"ఔన్నాయుడయ్యా! ఎంకడ్నే! 'సివంగి' అయ్యను ఎంకడ్నే!"

నాయుడయ్యకు పై ప్రాణాలు పైనే పోయాయన్పించింది. ఇవ్వాల్టితో తన బ్రతుకు ఆఖరన్పించింది నాయుడయ్యకు. ఐనా కొంచెం ధైర్యం తెచ్చుకుని, ఏదో చెప్పబోయాడు.

"హస్సెరి... నీ బూటకాలు నా దగ్గిర సాగవ్— నీకంటె 'పసరం' మేలు— నిన్ను యవలోండ్ల దగ్గరకు పంపకపోతే యీడు పిల్లెంకదేకాదు" అన్నాడు ఎంకడు రౌద్రంగా కత్తి నాయుడయ్య కంటిముందు ఝుళిపిస్తు— దాంతో పూర్తిగా అర్థమైంది నాయుడయ్యకు. తన చావు ఖాయమని ధైర్యం దిగజారిపోయి మనిషి గడగడ వణుకుతున్నాడు.

"ఎంకడూ తప్పైపోయింది— ఈ ఒక్కసారికి పైనున్న భగవంతుడి మొహంచూసి నన్నొదిలేయరా!" దీనంగా బతిమాలాడు.

"హే... బగమంతుడు! నీకు బగమంతుడుండదేమోగాని నాకు లేడు నాయుడయ్యా! నా 'సివంగి' అన్నేయంగా బలైపోయిన్నాడే బగమంతుడుకూడా సచ్చిపోనాడు— నిన్ను బతకనిత్తె— మరింగెంతమందిని నాశనంశేత్తవో!" అంటూ మరో అడుగు ముందుకు వేశాడు ఎంకడు కత్తిని పైకెత్తుతూ—

నాయుడయ్యకు కళ్ళు చీకట్లుకమ్మాయి. పారిపోవాలనుకున్నా వీల్లేదు. ఎంకడు ఒక్కోఅడుగు ముందుకువస్తుంటే, నాయుడయ్య వెనకడుగువేశాడు—

"ఎంకడూ! నేనుచేసింది పాపమేరా! మరి నువ్వుగూడాఇన్నాళ్ళూ పాపం చే...

"హస్సెరి" అని గర్జిస్తూ ఎంకడు విసిరిన కత్తి నాయుడయ్య మెడమీదపడి నరాలు కటకటమని తెగిన శబ్దం వచ్చింది. రక్తం చిమ్మి గోతిలో పడింది.

మరోసారి వికృతంగా వికటాట్టహాసం చేశాడు ఎంకడు— అలా నవ్వుతూనే ఉన్నాడు రెండునిముషాలపాటు. గిలగిల కొట్టుకుంటున్న నాయుడయ్యనుచూసి సంవత్సరం క్రితం తను చంపిన గొఱ్ఱెపిల్ల గుర్తుకొచ్చింది ఎంకడికి.

"దాన్ని సంపినందుకు నేను సచ్చేదాకా ఇచారిత్తానే ఉంటా నిన్ను సంపినందుకు మాత్రం బతికున్నంతదాకా సంతోసిత్తా నాయుడయ్యా" అనుకున్నాడు ఎంకడు—

మరుక్షణంలో 'నాయుడయ్య' అన్న చివరిమాటలు గుర్తుకొచ్చాయ్ ఎంకడికి. చేతిలో ఉన్న కత్తి వంకోసారి చూసుకున్నాడు.

"నాయుడయ్యా! సచ్చేముందైనా ఒక మంచిపనిజేసినవ్— నిబద్ధిగా నీతోపాటుగా నేనూ పాపంజేసినా— అందుకనే నేనుగూడా యీ బూమ్మీద బతికుండగూడదు. నీతో బాటే వత్తన్నా!" అనుకుంటు కళ్లు మూసుకుని, చేయి సాచి కత్తితో బలంగా మెడ మీద......

జమ్మిచెట్టుమీది గుడ్లగూబ, ఆ నిశ్శబ్ద నిశీధి ప్రశాంతతను భగ్నంచేస్తూ 'కెవ్వు' మని ఘూంకరించింది.

## వారసులం

సంతాల్

| | |
|---|---|
| బోల్షివిక్కు వారసులం | అమరజీవి పాణిగ్రాహి |
| నక్సల్‌బరి బిడ్డలం | అన్నయ్యకు తమ్ములం |
| జనచైనా వెలుగులలో | ప్రజాయుద్ధ పల్లవిని |
| నడుస్తోన్న వారలం | పాడుతున్న రచయితలం |
| | |
| పీడితజన ముక్తికొరకు | పాలకవర్గాలబట్టి |
| పోరుతున్న కాంతులం | సాయుధంగ గూల్చెదం |
| శ్రీకాకుళ రైతాంగం | విప్లవాన్ని కుట్ర అనే |
| చేతిలోని కత్తులం | శత్రుగోరి గట్టెదం |

ఒక నవచైనా గీతం:

## కాలవ దాటుతూ

లి ఇంగ్

ఆకుపచ్చని గరికా, దట్టమైన దుబ్బులూ
సూర్యుడస్తమిస్తున్నాడు
గుడిసెల్లోంచి పొగలేస్తుంది
వంటకట్టెను తీసుకొని
కాలవలోంచినడిచి మా బేస్‌కు తిరిగిపోతున్నాం
గ్రామీణస్త్రీలు మా యూనిఫారాలు ఉతుకుతున్నారక్కడ

ముప్ఫైఏళ్ళ క్రితం
ఒక వృద్ధురాలు గెరిల్లా యూనిఫారాలు ఉతుకుతుంటే
శత్రువులామెను ఎలా పొట్టనబెట్టుకున్నారో
గలగలమంటున్న ఈ సెలయేటికి ఏమైనా జ్ఞాపకముందా?

ఆమె మరణవార్త విన్న మా వాళ్లు
శతగాతుల్లోగూడా ప్రతీకారం భగ్గుమంది
కాలవరాళ్ళమీద కత్తులు పదును పెట్టుకున్నారు
డైనమెట్లు చార్జి చేసుకున్నారు
తొలి కోడి కూతదాకా తుపాకులు శుభ్రించేసుకున్నారు
బాటిల్స్‌లో కాలవనీళ్లూ మండే హృదయాల్లో పగా
నింపుకుని బయల్దేరారు

యుద్ధరంగానికి వస్తామంటూ
లెక్కలేనంతమంది పల్లె ప్రజలు
మా దళాల్లో కలిశారు
మబ్బుల్లోంచి, దూలిలోంచీ
చీకటి పర్వతాల్లో తుపాకుల మోతలోంచీ...

రాత్రుల్లో గాలిపాటుతో చెట్లు గానంచేశాయి
ఆమె గుడ్డలుతికిన ఆ రాయి వెన్నెల్లో నిర్మలంగావుంది

కాని నిరంతరం ప్రవహించే ఈ కాలవనీటిలాగే
సరికొత్త విజయవార్తలు మమ్మల్ని చేరుతూనేవున్నాయి

ఇప్పుడు ముప్పైఏళ్ళు జారిపోయ్యాయి
గాలికీ వానకూ తడిసిన ముప్పైఏయ్యేళ్ళు
కొండలూ, కాలవగట్లూ మళ్ళీ పచ్చనైనాయి
కాలవగట్టున దుబ్బులు మళ్ళీ దట్టంగా పెరిగాయి
ఆటుపోట్లతో ముప్పైఏయ్యేళ్ళు ప్రవహించాయి
ఒక్క చిహ్నమైనా మిగిల్చకుండా.
రోజులూ నెలలూ మాయమైపోయాయి
కానీ, ఆమె గుద్దులుశికిన ఆ రాయిబండ మాత్రం
ప్రజల కంకితమైన ఆమె హృదయంలాగే
ఈ పర్వతాలమధ్యన ఇంకా కొట్టుకుంటూవుంది

కొండలింకా ముసలివై పోలేదు
ఇప్పుడొక కొత్తతరం జాగృతమైంది
నిరంతరమైన కాలవలాగే వాళ్ళ పాటలు...
మా సమస్త భూభాగంమీదా ఎగురుతున్నాయి
వాళ్ళ ఎర్రజెండాలు

వంట కట్టెను తీసుకొని మేం కాలవ చేరుకునేసరికి
మా నెత్తురు కెరటాలై పొంగింది
కొందరు ఆ తుంగమొక్కల్ని పళ్ళమధ్యన పట్టుకున్నారు
మరికొందరు మొక్కలూది స్వరాలు పలికించారు

మేం
యువతరం
పోరాటాలపొగలో పెరిగాం
కాలవదగ్గరి ఈ ఆడపడుచులందరూ
ఆ త్యాగమూర్తి కూతుళ్ళే—

(అనువాదం : పినాకి)

సమీక్ష :

# బ్రౌన్ జాబులు (1832-1857)

(తెలుగు జర్నలిజం చరిత్ర)

సంకలనం, ప్రచురణ: బంగోరె

బంగోరె మాటలలో—

"నాలుగు యూనివర్సిటీలు, పధ్నాలుగు ఎకాడమీలు, సవాలక్ష సమితులు, ఘనత వహించిన ఐరావతంవంటి ప్రభుత్వం ఈ ఇరవైఅయిదేళ్ళలో చేయలేనిపనిని బ్రౌన్ ఒక్కడు ముప్ఫయిఏళ్ళలో చేసిపెట్టిపోయాడు. బృహన్నిఘంటువు సమకూర్చిపెట్టిపోయాడు. మహాభారతం మొదలు, మనుచరిత్ర, వసుచరిత్రవంటి ప్రబంధాలదాకా, వేమనపద్యాలు, సుమతిశతకం మొదలు తాతాచార్యుల వధలువంటి 'సలీసు' గ్రంధాలదాకా, వందలాది తెలుగుకావ్యాలు, కథలు కాలగర్భంలో కలిసిపోకుండా...పునరుద్ధరించి పెట్టిపోయాడు తాటియాకుల్లో తప్పులు తడకలుగాఉన్న కావ్యాలకు మోక్షం కలిగించి, శుద్ధప్రతులు తయారుచేయించిపోయాడు. పండితులను నియమించి వ్యాఖ్యలు వ్రాయించాడు... ఒక్కమాటలో చెప్పాలంటే తేజోవిహీనంగా ఉన్న తెలుగు వాఙ్మయానికి పునర్వికాసద్వారాలు తెరిపించిపోయాడు బ్రౌన్.

"...140 ఏళ్ళకిత్రం పునాదినుంచి నిర్మించుకొంటూవచ్చి ఆయన ఇంతపనిచేసిపోయాడు..."

"బ్రౌన్ గీచిన గిరిదాటి మనం నేటికీ ఒక్క అడుగైనా ముందుకు వేయలేకపోతున్నామనుకోవలసి వస్తున్నది...తన జీతంలో ముప్పాతిక మువ్వీసందాకా తెలుగు సాహిత్య పునరుద్ధరణకే ఖర్చుపెట్టిపోయాడా అనిపిస్తుంది... మద్రాసులో ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరీ మొత్తంలో దాదాపు మూడింట రెండువంతులదాకా ఆక్రమిస్తున్న బ్రౌన్ సేకరణలను పరిశీలిస్తే ఎవరికైనా ఈ భావం కలక్కపోదు."

బ్రౌన్‌జాబుల విషయానికివస్తే—

"బ్రౌన్ సేకరించిన జాబులు... 16 సంపుటాలు... దగ్గరదగ్గర 6 వేల పేజీలున్నాయి... తెలుగుదేశపు నాలుగు చెరగులనుండి... పండితులు, పామరులు, ముక్కుమొగం తెలియనివాళ్ళు వ్రాసినవి. అడపాదడపా ఆయన ప్రత్యుత్తరం వ్రాయించిన నకళ్లుగాక, వివిధ జిల్లాల కలెక్టర్లకూ, జడ్జీలకు...క్రింది ఫాయానౌకర్లూ, ఉద్యోగస్తులు, సామాన్యజనం వ్రాసుకొన్న అర్జీలు,...విజ్ఞాపనలు: అంతేగాక ఆనాటి తెలుగువారు స్త్రీలు పురుషులు వ్యక్తిగత పరిధిలో వ్రాసుకొన్న సంసారపక్షపు జాబులు; కొన్ని

సమకాలిక తెలుగుపత్రికలలో వచ్చిన సంపాదకలేఖలు, వార్తలు. వ్యాఖ్యలు... ఎన్నింటినో ఆయన కాపీచేయించి క్రోడీకరించిపెట్టి పోయాడు...ఈ జాబుల వైశాల్యం 1790 నుండి 1854 దాకా."

ఈ మహాసముద్రంనుంచి బంగోరె ఎన్నుకున్నది తెలుగు జర్నలిజంకు సంబంధించిన కొన్నిజాబులను– 1832 నుంచి 1857–మాత్రమే. వీటిలో వ్యక్తమయే తెలుగు జర్నలిజం చరిత్రే ఈ గ్రంథం సారాంశం.

తెలుగులో అచ్చుపని 1806 ప్రాంతంలో ప్రారంభమయిందనీ, 1830 దాకా అందులో ఎదుగూ బొదుగూలేదనీ, 1835 నాటికి (ఇంగ్లీషువారు నడిపినవిగాక) హిందువులు నడిపిన ప్రెస్‌లు కనీసం 8 ఉండేవనీ, తెలుగు, తమిళపత్రికలుండేవనీ బ్రౌన్ అన్నాడు.

1832 జనవరి 4న ఫోర్ట్‌సేంట్ జార్జ్‌గెజెట్ ప్రచురణ ఆరంభమయింది.

1833లో తొలి తెలుగు, తమిళపత్రిక వెలువడినట్టు రివరెండ్ జె. లాంగ్ అనే ఆయన రిపోర్టు. "ఆ తెలుగుపత్రిక ఊరుపేరేమిటో తెలియదు"

మనకుతెలిసిన మొదటి తెలుగుపత్రిక "వృత్తాంతిని" దీన్నిగురించిన ప్రస్తావనలు బ్రౌన్ జాబుల్లోఉన్నాయి. ఈ పత్రికమీద ప్రభుత్వం 1838లోనే నిఘాపెట్టింది. అందుచేత ఇది కనీసం 1838లో ప్రారంభమై 1841 దాకా నడిచింది. ఇది ఆగిపోతూనే "వర్తమాన తరంగిణి" (1842 జూన్ 8న) పుట్టింది. ఈ పత్రికనుంచి ఎన్నోజాబులు వృత్తాంతాలూ, వార్తలూ, విశేషాలూ కాపీచేయించి బ్రౌన్ భద్రపరిచాడు. తన నిఘంటువులో కొన్నిమాటలను ఈ పత్రికనుంచి తీసుకున్నాడు. (అప్పటికి గ్రాంధికభాషావాదం పుట్టలేదు. వ్యావహారికభాషా, ప్రాంతీయాలూ పుష్కలంగ రచనలకెక్కేవి.)

"వృత్తాంతిని"లో బ్రౌన్‌వద్దఉండిన జ్యోతీషగ్రంధాల. వైద్యశాస్త్ర గ్రంధాల వివరాలు పడ్డాయి. ఆమీదట రాజమహేంద్రవరం కాపరస్తుడయిన బొమ్మరాజు నాగేశ్వరరావు అనే ఆయన "ది 8 శపటంబరు 1839 సం॥"న "మహారాజశ్రీ సీ పీ. బ్రౌన్ యిస్కోయరు (ఎస్క్వైర్) దొరగారి సముఖానకు" ఒక జాబురాస్తూ, బ్రౌన్ వద్ద ఉన్న అయిదు జ్యోతీష గ్రంధాలను నకళ్ళురాయించి, బంగీ పోస్టుద్వారా పంపమని కోరాడు. అదే ఉత్తరంలో తనవద్దఉన్న జ్యోతీషగ్రంధాల పేర్లు చెప్పి, వాటిని బ్రౌన్‌కు పంపుతానన్నాడు.

జర్నలిజంతో ముడిపడినవే రీడింగ్ రూములు. రాజమండ్రిలో జడ్జిగా పనిచేసిన జేమ్స్ టామస్ 1839లో రాజమండ్రిలో ఒక రీడింగ్‌రూమ్ స్థాపించాడు. అందులో చిన్న ఇంగ్లీషు, తెలుగు పుస్తకాలూ, పత్రికలూ ఉండేవి. రోజుకు వందమందివచ్చి



అక్కడ చదివేవారు. చిత్రమేమిటంటే ఆ తరవాత దాదాపు 30 ఏళ్ళకు విశాఖపట్నంలో మొదటి లైబ్రరీ స్థాపించినట్టు "తెలుగు సంస్కృతి" సంపుటంలో రాసి వున్నది.

జేమ్స్ టామస్ భార్య ఇంగ్లండుకు రాసిన ఉత్తరాలలో తన భర్త స్థాపించిన రీడింగ్ రూమ్ గురించేగాక, మద్రాసునుంచి వెలువడే తెలుగుపత్రిక ('వృత్తాంతిని') గురించి, 1839 జనవరి 10 నాటి ఉత్తరంలో ఇలా అన్నది:

"చాలా చిత్రమైనది .. రచనలు ఇంగ్లీషునుంచి తర్జుమా అవుతాయి చెత్తరుకు. ఉదాహరణకు రాణిగారి పడకవర్ణన. అడవి చాపమీద, పైన ఏమీ కప్పుకోకుండా పడుకుంటుందిట ! ఇటీవల సంచికలో మద్రాసు గవర్నరు ఇచ్చిన విందు వివరాలున్నాయి. దానికి చాలామంది దేశీయులు ఆహ్వానించబడ్డారట."

ఈనాడు పత్రికలలో బొక్కులు కట్టివేసేవి ఇంతకన్నఘనంగా ఉన్నాయా ?

బ్రౌన్ లేఖలలో "వృత్తాంతిని"కి ఒక పాఠకుడు రాసినలేఖ ఉన్నది అందులో ఆయన పెళ్లిళ్ళలో జరిగే దుర్వ్యయం గురించీ, 'దాసీ'ల నృత్యాలు ఏర్పాటుచెయ్యటం గురించీ ... ఈయన వాస్తవదృష్టిగలవాడుగా కనిపిస్తాడు. తనలేఖ(15–2–1841) చివరలో "యీ కాకితము చదివేవారు తోడుతోనే తమ యింట్లో పెండ్లి ప్రయోజనాలు వస్తే కచ్చేరియుంచడము యిప్పుడే మానుతారని నేను యెంచలేదు. గాని దినంపేరట, యిందులో వ్రాసియుండే సంగతులు యెంచుకొని కచ్చేరి యుంచక మానుతారనే యెగల నేను సందేహించలేదు" అన్నాడు.

ఈ పెద్దమనిషి కచేరీలలో ఆడే "దాసీల"పట్ల చాలా ఔదార్యంకూడా చూపాడు. "15 సంవత్సరాలకు మునుపు కచ్చేరీలకువచ్చేవారు నాట్యమాడుతూయుండే దాసీకి రూపాయలు వేసే మర్యాదకద్దు... నర్తనముచేసేదానికైనా యేదైనా ప్రయోజనము కద్దా అనిచూస్తే, కచేరికి వచ్చినవారు రూపాయిలువెయ్యక వెళ్ళిపోయినారు. మర్యాదలను తప్పి సభలో నిలుచుండి, సౌజ్ఞలచేతనున్ను, యుక్తులచేతనున్ను కొన్ని రహస్యాలనంతా బయలుచేసి, లజ్జవిడిచి. మానముచెడి యింత కష్టపడ్డవెనుక యింటి యజమానుడివద్దకివెళ్ళి దేహీ అని అడిగితే అతనికి యిష్టంవచ్చినమట్టుకు ఏమి యిచ్చినా తీస్కుపోతున్నారు గనక వీరికిని కష్టానికి తగినఫలప్రాప్తి లేదు" అన్నాడు.

గిడుగు రామమూర్తిగారు ఈ జాబును తన 'గద్యచింతామణి'లో ప్రచురించారట.

"వృత్తాంతిని" నిలిచిపోయి "వర్తమాన తరంగిణి" వచ్చింది. ఈ పత్రిక ప్రస్తావన బ్రౌన్ జాబులలో విశేషంగా కనిపించటమేగాక, ఈ పత్రిక తొలి సంవత్సరపు (1842–3) ఫైలునుకూడా భద్రించేశాడు బ్రౌన్.

1847 జనవరిలో ఈ పత్రిక బ్రౌన్‌కు పుస్తకాలు అచ్చువేసే పనిపెట్టుకుని, మహాభారతం అచ్చువేసిపెట్టింది. ఈ సందర్భంలో, తొలి భారతముద్రణ ఎప్పుడు జరిగిందన్న సమస్యగురించి ఖండవల్లి లక్ష్మీరంజనం, దివాకర్ల వెంకటావధాని ప్రభృత పండితులు కొనసాగించిన, "కేంద్ర రాష్ట్రప్రభుత్వాల బొక్కసాలనుండి గ్రాంటులుగా లభించిన లక్షలరూపాయల...మ్రింగివేసిన "ఆంధ్ర మహాభారత సంశోధిత ముద్రణ ప్రతిపథకం"చూస్తే, "బ్రౌన్ భద్రపరచిపోయిన ఈ పత్రికపైనైనను చూడాలనేధ్యాసే ఈ పండితులకు లేదు."అని బంగోరె ఆక్షేపణ.

ఈ పుస్తకంలో "ఆనాటి నక్సలైట్లు"అన్న ఒక చిన్న విభాగంఉన్నది. ఇందులో 1843 నాటి ఒక అయిటమూ, 1847నాటి మరొక అయిటమూ ఉన్నాయి. మనకు వీటి ప్రాముఖ్యం ఏమిటంటే, 1857 కు పూర్వం ఉండిన స్థితిని ఇవి సూచిస్తాయి. 1857లో బ్రిటిషువారిమీద జరిగిన తిరుగుబాటును బ్రిటిషువాళ్ళు సిపాయీల కలహం అన్నారు. మనవాళ్ళు తొలి స్వాతంత్ర్య సమరం అన్నారు. మార్క్సిస్టు దృక్పథంలో అది రైతులు సాగించిన విప్లవం. వారికి నాయకత్వం వహించటానికి చమురుకాళ్ళ ఫ్యూడల్ ‌ఇతప్ప లేకపోవటంతో అది విఫలమయింది. అందుచేత, ఈ రెండు అంశాలలోనూ ఉదాహరించిన వ్యక్తులను "నక్సలైట్లు" అనటంలో బంగోరె అవగాహన పూర్తిగా రైటుకాకపోతే ఇక్కడ ఒక్కందుకే బంగోరెను తప్పుపట్టాలి: 1843 ఉత్తరముందువేసి, 1847 ది తరవాతవేస్తే ప్రభుత్వ దృక్పథంలో కలిగిన పరిణామం కళ్ళకుకట్టినట్టు కనిపించి ఉండేది. చూడండి:

"కడపజిల్లాలో చేరిన వక గ్రామమందుండే రహితు విషయములో ఆ గ్రామ కరణం (ఒకానొక వేతనశర్మ!) కొన్ని అక్రమములను జరిగించి అతణ్ణి పారాలో వుంచినందున గర్భిణిగానుండిన అతని భార్య యీ కరణంవద్దకి వచ్చి తన పెనిమిటిని విడిచిపెట్టమని అడిగినంత అతను ఆ ప్రకారం జరిగించినందున సదరజీస్త్రీ వుదాసీన ముగా మాటలాడెను. అంతట ఆ కరణానికి కోపమువచ్చి ఆస్త్రీ కడుపుమీదతన్నగానే కొన్ని నిముషములకు అది మృతిబొందెను. తరువాత దాని పెనిమిటి హెడ్డాప్ పోలీస్ వారివద్దనున్ను మేజిస్ట్రేటువారివద్దనున్ను ఫిర్యాదుచేసుకున్నంతట యీ అధికార్లవల్ల న్యాయం చిక్కనందున చన్నపట్టణముకువచ్చి గవర్నరుగారికి అర్జీయిచ్చుకొనెను. ఐతే ఆ అర్జీకి జవాబు పుట్టనందున యీ ఫిర్యాది గవర్నరుగారు సవారి వెళ్లుతూవుండగా బండిని అడ్డగించుకొని గుర్రముల లగాములను పట్టుకున్నంతట యితణ్ణి మేజిస్ట్రేటు వారి వద్దకు అంపిరి. అంతట మేజిస్ట్రేటు వారియెదట యీ ఫిర్యాది చెప్పిన సంగతులు న్యాయానుగుణంగా వున్నందున యీ విషయము ౧ కడపజిల్లా కల్లకటరుగారికి పోలీసు



వారు వ్రాసి అంపినట్టు కనుపడుచున్నది. యిందున గురించి యీ ఫిర్యాదికి న్యాయం కలుగునని నమ్ముచున్నాము."

—వర్తమాన తరంగిణి, 1843 జూన్ 29

దీని అనంతరం నాలుగేళ్ల పూర్తిగా నిండకముందే మరొక సంఘటన.

"ఈ మే నెల 18 తేది మంగళవారమునాడు మన గవర్నమెంటు ఆలోచన సభ్యులు సుమారు 12 ఘంటలకు సభాస్థలియందు వచ్చి ప్రవేశించేటప్పుడు ప్రథమ ఆలోచనకర్తయైన మోస్టు నోబల్ గవనరు మార్క్విసాఫ్ ట్వీడేల్‌గారు సదరణీ గవరన్మెంటు హజారమువద్దకి వారి రథము(?)దిగి కాలినడకన వెళ్లేటప్పుడు కింది యుద్యోగస్తులవల్ల అన్యాయముపొందిన నొక వ్యాజ్యకావు యెన్నిమార్లు అధికారులకు అర్జీయిచ్చుకొన్నప్పటికిన్ని జవాబులేకపోవుటచే గవనరుగారి యెదిటికి తను పొందిన అన్యాయమును చెప్పుకోవలెనని ప్రాణభీతిని పోగొట్టుకోబడినవాడై బహుధైర్యముతో హజారమువద్ద పోవుచుండే గవనరుగారితో సంధించి పైబడి— గవనరుగారి మొలకట్టులో చెయిపెట్టి పట్టుకొని న్యాయము చెప్పి పొమ్మనుమని వదలకపోయినందున ప్రాణమునకు తెగించిన వ్యాజ్యకావు న్యాయాన్యాయమును విచారించకుండా జయిలుఖానాకు పంపించినట్టు విన్నాము.

—వర్తమాన తరంగిణి, 1847 మే 27.

ఈ రెండు వార్తలనూ ఈ క్రమంలో చదివితే "పరిణామం" బోధపడుతుంది. రైతులకు చిన్న పెద్ద ఉద్యోగులంతా ద్రోహంచేసినవాళ్ళే. అగ్రిపాలకవర్గం పట్టించుకోలేదు. కాలం గడిచేకొద్దీ పీడితులలో తిరుగుబాటు తీవ్రత హెచ్చింది. వారికి న్యాయం జరుగుతుందని పత్రికలు ఆశించే అవకాశం తగ్గింది.

పై రెండూ వ్యష్టి తిరుగుబాట్లేగాని విప్లవోద్యమాలుకావు. అంతమాత్రానవారు వీరులు కాదనగలమా. ఈ కాలపు నపుంసక జర్నలిస్టులలాగా కాకుండా ఆనాటి వర్తమాన తరంగిణి అన్యాయం జరిగినవారి దృక్పథంతో, వారి ధైర్యసాహసాలను మెచ్చుకుంటూ రాసింది. ఈనాటి విప్లవోద్యమ వార్తలనుకూడా యివ్వటానికి నోచుకోని పురానా పత్రికలు మనకున్నాయి. 150 ఏళ్ళలో తెలుగు జర్నలిజం సాధించిన అభివృద్ధికి ఇదొక మచ్చుతునక.

జాతీయోద్యమంకూడా ఆనాడు జర్నలిజమును ఆవేశించింది. అయితే అప్పటి జాతీయవాదంలో మతాభిమానమూ, ప్రాచీన సంస్కృతిపట్ల అభిమానమూ పాలుఎక్కువ. ఈనాడుకూడా ఆ జబ్బులతో బాధపడుతున్న మనం ఆనాటి పరిస్థితిని నిందించేపని లేదు. కాగా, ప్రభుత్వాన్ని దుయ్యబట్టటంలో వర్తమాన తరంగిణి ఈనాటి అనేక పత్రికలకన్న ఎక్కువ పౌరుషమే చూపిందనాలి.

ఈ దిగువ ఉదహరించిన రచనలన్నీ బ్రౌన్ సేకరణలే.

"గొప్పకొద్ది తరగతిగల గౌనరుమెంటు తరపునే టీవి యుద్యోగస్తులందరు స్వామిద్రోహము విశ్వాస ఘాతుకము చేయుటయేగాక జిల్లాలోని కాపు (రైతు) లను మిక్కిలి శ్రమపెట్టుచున్నారనియు శిరస్తా తహశ్శీలుదారు కొత్వాలు రికార్డుకీపరు మొదలయిన హోదాలలో ప్రవేశించేవారందరు... కొద్దికాలములోగా విస్తరించి ద్రవ్యమార్జించుచున్నారనియు కాపులయొక్క స్వాతంత్ర్యములను చెరుచుటయేగాక వారివద్దనుండి విశేషముగా లంచము పుచ్చుకొనుచున్నారనియు... స్పెక్టేటరు పత్రికాకారుడు తెలియజేసియున్నాడు."

హిందువులు క్రైస్తవమతం పుచ్చుకుంటే యిలాటి కష్టాలు తప్పుతాయని ఆ పత్రికా కారుడు రాశాడు.

"మేలు చేసినవానికి కీడుచేయడమువలన జయము కలుగుచుండెడి యీ దుష్కృత కాలమందు హిందూలకిటువంటి బుద్ధి కలిగియున్నట్టయిన యింగిలీసువారి ప్రభుత్వమేలు యీ దేశమునందు స్థిరపడియుండును(?)... కిరస్తు మతస్థులు చేయుచుండెడి యక్రమములు వక్కాణింప శక్యములేకనున్నవి.

"...ఈ యింగిలీషువారుచేసిన మోసములు తంత్రములు దుర్మార్గములు మొదలయినవి యంగులాండు– ఫ్రానిన్‌సి–జర్మని–స్కాట్లెండు మొదలగు దేశచరిత్రలయందు వ్రాసి యుండుటను యెల్లవారు చూచియుండలేదా (?) హిందురాజులతో చేసుకొన్న యొడంబడికెల కతిక్రమించి మిత్రద్రోహముచేత వారి సంస్థానములను నాశనముచేసిన సంగతి పోయిన సంవత్సరము ఏప్రిల్ నెలలో హానరేబిల్ కోర్టాఫ్ డిరెక్టరులవారిఎదుట మేస్టరు సలివెన్‌గారు చేసిన ప్రసంగము దృష్టాంతముగ నుండలేదా(?)... కొబట్టి పత్రికాకారులు తమ యభిప్రాయములను తెలియజేయడమందు లోకులయొక్క సుగుణ దుర్గుణములను చక్కగా నాలోచించవలసినది ధర్మము–

"ఈ హిందూదేశమునందు ప్రభుత్వము చేయుచుండెడి యింగ్లీషు దొరతనము వారి కోర్టులయందు నియమింపబడియున్న న్యాయాధిపతులు తాము లోబడవలసిన చట్ట నిబంధనముల కతిక్రమించి స్వదేశపు కాపులయొక్క ప్రాణ మాన సొత్తులకు భంగము కలుగునట్లు నిర్భయముగ చేయుచుండెడి తీర్పులను గురించియు– మతములను జెరుచుటయే ముఖ్యావశ్యకమైన పనిగా బూనుకొనియుండెడి మిష్‌నేరులకు చేయుచుండు సహాయ్యమును గురించియు– హర్ మేజెష్టి రాణిగారికి మన్విచేసుకొనే నిమిత్తమీ పట్టణమందుగల గొందరు హిందూ ప్రముఖులు యోచించుచున్నట్టు విన్నాము..."



అయితే సదరు హిందూలు సముదాయముగా నుండెడి తమ స్వాతంత్ర్యములను కాపాడుకొనే విషయమునందు జాలములనియు– తెగలనియు కుడియడమ కతిలనియు– యీ మొదలయిన నియమములను వర్జించి యైకమత్యమును వహించి–తమ ప్రాణమాన సొత్తులను కాపాడుకొనే విషయమై తగిన కట్టుబాటుల నేర్పరచికొనినపిదప కంపినివారివలన కలుగుచున్న కొరతలను పార్లమెంటువారికి తెలియజేసి కొనినట్టయిన న్యాయము చేయుదురని నమ్మవచ్చును. స్వదేశస్థులలోనటువంటి కట్టుబాటు లేకపోవుటచేత నేకదా సాధారణముగా వర్తకము చేసికొనుటకు వచ్చిన యింగిలీషువారీదేశము నాక్రమించుకొని వారి జయస్తంభము నా చంద్రార్కముగా నాటి యుంచుటకు తగిన కృషిచేయుచున్నారు–

సుమారు 250 సంవత్సరములక్రిందట... యప్పటి హిందూదేశపురాజులు నిష్పటులుగా నుండుటచేత తంత్రముగల యీ యింగిలీషు మనుష్యులు సదరు హిందూదేశపు రాజులచే ననేక సన్మానములను బొంది మిత్రద్రోహము చేయుట కారంభించి మాయోపాయములచేత గొన్ని యధికారములు సంపాదించుకొని యీ దేశమునందు తామే ప్రభుత్వము చేయుటకు చేసిన కృషి ఫలితమైనపిదప ప్రజావశీకరణము కొరకు పూర్వపు రాజులకంటే తమ ప్రభుత్వము మిక్కిలి నీతిగలదిగా కొంతకాలము కనుపరచుచువచ్చి...తమ మతము నీ దేశమునందు వ్యాపింపజేసినపక్షంబున తమ దొరతనము బలపడుటకు సాధకముగా నుండునని నిశ్చయించి, మంద మందముగా మిషినేరి సమూహములను హిందూదేశమునందంతట వ్యాపింపజేసి, పట్టణములు– పల్లెలు మొదలగు స్థలములయందు మిషినేరి పాఠశాలలను స్థాపించియుండుటచే నా పాఠశాలలు అజచర్మం కప్పుకొనియున్న వ్యాఘ్రములనే సంగతి హిందూలు తెలిసికొనక తమ చిన్నవాండ్లనచ్చటికి పంపుటవలన స్వమతమునందు జ్ఞానశూన్యులయిన బాలురకు మిషినరీలు తమమత విషయమును బోధించి మిధ్యామతులుగాజేసి, కిరస్తు మతములో చేర్చుకొనుచున్నారు.

"సుమారు 40 సంవత్సరములకు పూర్వము హిందూదేశమునకు మిషినేరులు రాకూడదని చేసియున్నారనే యుత్తరువుకు విరోధముగా ప్రకృతము హానరేబిల్‌కోర్టువారీ హిందూదేశమునకు మూకమూకలుగా మిషనేరులను బంపుట కేల సమ్మతించిరి. (?) ఆ మిషినేరులకు సర్కారు యిలాకాతోచేరిన యూరోపు వుద్యోగస్థులు మిక్కిలి ప్రీతితో గొప్ప మొత్తముల నేలయిత్తురు (?)"

ఇలాంటి జాతీయోద్యమ స్వభావాన్ని మనం సులువుగా విశ్లేషించవచ్చు. ఈ రచనలో వలసపౌరులమైపోతామన్న భయంఉన్నదిగాని, అయిపోయామన్నభావం ఇంకా లేదు. నిజానికి బ్రిటనును పాలించేవారూ, కుంపుణీని శాసించేవారూ ఒకటికాదు: వల

సలు గుదిబండలని భావించేవాళ్ళింకా బ్రిటన్‌ను పరిపాలిస్తున్నారు. పరపరిపాలన మనవాళ్ళకు కొత్త కాదు. రాజులు మారేవారు. రాజ్యాల సరిహద్దులుమారేవి. అస్తమానమూ యుద్ధాలుజరిగేవి. మధ్యమధ్య ముస్లిముల పరిపాలన. రానురాను బుడతకీచులు- ఫ్రెంచి వాళ్ళు- ఇంగ్లీషువాళ్ళు. ఈ అనుభవాలమధ్య కుంపణీ పరిపాలన కొంతకాలం ప్రజానీకి హాయినిచ్చింది. అది సామాన్యప్రజల జీవితలలో అశాంతి తగ్గించి, వాటిని ముందును నడుపుతున్నట్టు కనబడింది.

ఆ సమాజంలో అట్టడుగువాడు రైతు. పరిపాలనలోఉండిన పీడనభారమంతా రైతుపైనపడింది. సామాజిక సంబంధాలలో సంచలనంకలిగింది. దురన్యాయం కొట్టి వచ్చినట్టు కనబడుతున్నది. దానిమీదట మిషనరీలు వచ్చిపడి ఒక మత వైరుధ్యం తెచ్చిపెట్టారు. ముస్లిము పాలకులుకూడా మత వైరుధ్యాలు తెచ్చిపెట్టారుగాని, మతాభిమానాన్ని జాతీయభావంగా చెయ్యలేదు. చిత్రమేమిటంటే, ముక్కాలు శతాబ్దంగడిచిన అనంతరం జాతీయ విమోచనోద్యమం నడిపినవారు ఇదే జాతీయభావాన్ని ఇంచుమించు ఇలాగే ప్రదర్శించారు. గాంధీ అహింస అనేడిదానికి జత చేర్చాడు. అవతల సామ్రాజ్యవాదం ఫాసిజంలాంటి వెర్రితలలువేసి, అంతర్గత వైషమ్యాలు కారణంగా శిథిలమై పోకపోతే గాంధీనడిపిన జాతీయోద్యమం ఏమీ సాధించిఉండేదికాదు. దీనికితోడు ప్రజలలో విముక్తి పోరాటపాటవం గాఢీగిసినగిరులు దాటి పొంగింది. రష్యా ప్రభావం విస్తరించింది. హిట్లరును ఓడించిన ఘనతను భారతీయులు స్టాలిన్‌కిచ్చారుగాని చర్చిలుకూ, రూజువెల్టుకూ ఇయ్యలేదు. న్యాయంగా ఆలోచిస్తే సామ్రాజ్యవాదం ఫాసిజం భూతంబాటున దాగయత్నించిన అనంతరం ప్రజా విప్లవంతప్ప జాతీయ విమోచనకు మరొకమార్గం లేకుండాపోయింది. అందుకే మనం వలసనుండి అర్ధవలసకూ, రాజకీయ పీడననుండి ఆర్థిక పీడనకూ, వలసవిధానంనుండి నయావలస విధానానికీమారి "స్వతంత్రం" అయామనుకుంటున్నాం.

మిగిలిన అన్ని విషయాలూ వదిలేసినా జర్నలిజంవరకే చూసుకుంటే ఏమి మారింది?

" 'సృజన', 'పిలుపు' పత్రికల సంపాదకులు వరవరరావు, యం. టి. ఖాన్‌లను ఘనతవహించిన ఆం. ప్ర. ప్రభుత్వం అంతరంగిక శాంతిభద్రతల పరిరక్షణ చట్టంక్రింద అరెస్టుచేసి జైల్లో కుక్కిన వార్తను ఇప్పుడే చదివాను...అలనాడు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, మళ్ళీ ఇప్పుడువీరు, పత్రికాసంపాదకులుగా జైలుకువెళ్ళారు... తెలుగు జర్నలిజం చరిత్ర వికాసానికి గర్వపడుతున్నాను, వళ్లు ఉడుకెక్కుతున్నది."— బంగోరె.

అవును, జర్నలిజంలో ముందడుగు ఉన్నది. ప్రభుత్వమే దిగజారుతున్నది.

— కొడవటిగంటి కుటుంబరావు

ఆనాడు:

# రక్తపాతాన్ని అనివార్యం చేసింది పాలక పక్షం

[భగత్‌సింగ్, బటుకేశ్వర దత్ 1929 ఏప్రిల్ 22న ఢిల్లీ పార్లమెంటు (అసెంబ్లీ) భవనంలో బాంబులు పేల్చారు. అధ్యక్షుడు గాయపడకుండా అతనిపక్కగా వేశారు. మోతీలాల్ నెహ్రూ, విఠల్‌భాయ్ పటేలు అధ్యక్షుడి సమీపంగానే కూర్చున్నారు. చేతిబాంబులు విసిరింతర్వాత అక్కడి సభ్యులు, ప్రేక్షకులు భయభ్రాంతులై పరుగెత్తసాగారు. భవనం పొగ నిండుకొంది. తప్పించుకొని పారిపోవడానికవకాశముండీ భగత్‌సింగ్, బటుకేశ్వరదత్‌లు తమ స్థానంలో(గాలరీలో)నిలబడి కరపత్రాలు విసిరారు. భవనం దద్దరిల్లేటట్లుగా 'ఇంక్విలాబ్ జిందాబాద్' ('విప్లవం వర్ధిల్లాలి')అంటూ నినాదాలిచ్చారు. కరపత్రం బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా వున్నందున ప్రభుత్వం వెంటనే ఆకరపత్రాన్ని నిషేధిస్తూ- కరపత్రాలన్నిటినీ స్వాధీనపర్చుకుంది. కానీ ఆ సాయంత్రమే 'హిందూస్థాన్ టైమ్స్' పత్రిక ప్రత్యేక సంచిక వితరణంచేస్తూ— ఆ కరపత్రాన్ని ప్రచురించింది. దాని 'ఫోటోస్టెట్ కాపీ'ని పంజాబ్ యూనివర్సిటీ ఇంగ్లీషులో ప్రచురించిన భగత్‌సింగ్ జీవిత చరిత్రలో ప్రకటించారు. ఆ కరపత్రం తెలుగు అనువాదమిది— అనువాదకుడు ]

ఈ బాంబు పేలుడుతో అధికార గర్వంతో చెవులు మూసుకుపోయిన బధిరులు వినునట్లు చేయడమే మా ఆశయం. ఇంతకు పూర్వం ఫ్రాన్సుదేశపు అమరవీరుడు 'వాలియంట్' యిటువంటి సందర్భంలోనే జరిపిన సాహసకృత్యంతో పోల్చుతూ- మా ఈ చర్య న్యాయసమ్మతమైందిగా దృవీకరిస్తున్నాం.

మేమిప్పుడు మాంటింగ్-చెమ్స్‌ఫర్డ్ సంస్కరణవల్ల ఈ పదేళ్ళకాలంలో జరిగిన వక్రచరిత్రనుగానీ, ఈ బూటకపు భారత పార్లమెంటుద్వారా భారతిజాతికి జరిగిన అన్యాయాలు, అవమానాల గురించిగానీ వివరించ దలచలేదు. ఓ పక్క ప్రజలు సైమన్ కమీషన్ ఏదో ఒరగబెట్టుందని ఆశిస్తు ఆ విదిల్చే మెతుకులు పంచుకోవడానికి నిరంతరం పోట్లాడుకొంటున్నారు. మరోపక్క ప్రభుత్వం ప్రజా సంరక్షణ, (Public Safety) కార్మిక తగాదా (Trade Dispute) బిల్లులను ప్రవేవపెట్టి ప్రజల్ని అణచివేయడానికి ప్రయత్నిస్తోంది. పత్రికా స్వాతంత్ర్యాన్ని హరించే బిల్లును రాబోయే సమావేశానికి జాగ్రత్తపరచుకొంది. విచక్షణారహితంగా కార్మికనాయకులను నిర్బంధిస్తోంది. ఇవన్నీ చూస్తుంటే గాలులు ఎటువైపు వీస్తున్నాయో తేటతెల్లమౌతోంది.

ఈ తీవ్ర పరిస్థితుల్లో "భారత సోషలిస్టు రిపబ్లిక్ అసోసియేషన్" దీర్ఘంగా ఆలోచించి, తన కర్తవ్యాన్ని గుర్తించి, తన సైనికులను ఈ కార్యనిర్వహణకు నియమించింది. ఈ మాచర్యవల్ల ప్రభుత్వం కనీసం యిప్పటి ఈ హృదయ విదారక చర్యల్ని తాత్కాలికంగానైనా ఆపనీ- ఈ దోపిడీ ప్రభుత్వం తన యిష్టమొచ్చినట్లుగా ప్రవర్తించనీగాక- అవి ప్రజలముందు నగ్నంగా బహిర్గతవర్చుతాం.

ప్రజా ప్రతినిధులు తమ నియోజకవర్గాలకు తిరిగిపోయి- రాబోయే విప్లవానికి ప్రజాసమూహాల్ని సిద్ధపరచనీ- మేము ప్రజా సంరక్షణ, కార్మిక తగాదాబిల్లును, లాలా లజపత్‌రాయ్‌గారి దారుణ హత్యాకాండను- నిస్సహాయ భారత ప్రజాసమూహం తరపున తీవ్రంగా నిరసిస్తూ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం. మమ్మల్ని మీరు సులువుగా చంపగలరు. కానీ మాలో మండే భావాల్ని వధించలేరు. చరిత్రలో యిప్పటికెన్నో సామ్రాజ్యాలు కూలిపోయాయి కానీ, భావాలు సజీవంగావున్నాయి. బార్బన్లు, జార్ చక్రవర్తులు పతనమయ్యారు.

మానవ జీవితాల్ని అతి పవిత్రంగాభావించే మమ్మల్ని- ప్రజలు సంపూర్ణమైన శాంతి, స్వేచ్ఛల ననుభవించే మహోన్నతమైన భావినాశిస్తున్న మమ్మల్ని- హింసా ప్రవృత్తికి, మానవరక్తాన్ని ప్రవహింపజేసే తప్పనిసరి పరిస్థితులకు మీరే బలవంతంగా తోస్తున్నారు. కానీ, ప్రజలందరికి స్వేచ్ఛను ప్రసాధించి, మనిషిని మనిషి దోపిడీ చేయడాన్ని అరికట్టగలిగే సమసమాజ స్థాపనకై సాగే 'మహావిప్లవ' బలిపీఠంపై కొందరి ఆత్మార్పణ తప్పనిసరి.

విప్లవం వర్థిల్లాలి.

... ... ...

[అనువాదం : ముడార్ వేణు]

ఈనాడు :

# ఆయుధాలు ధరించడం నా జన్మహక్కు

[నవంబర్ 7, 1973, దేవగడ్ (బిహార్) ఫస్ట్‌క్లాస్ జుడిషియల్ మెజిస్ట్రేట్ వి. కె. ఆచార్య కోర్టులో అసిమ్ ఛటర్జీచేసిన ప్రకటన.]

ఈ కేసు విచారణలోకివెళ్లేముందు మూడు ప్రాథమిక విషయాలపై నా అభిప్రాయాలు వెల్లడిస్తాను.

మొట్టమొదట: ఈ కోర్టువిచారణను నేను అవమానకరమైందిగా భావిస్తున్నాను. సాయుధ విప్లవం కోసం పనిచేసే ఒక రహస్య విప్లవపార్టీ సభ్యుణ్ణి లైసెన్సులేనిఆయుధాలుకలిగి ఉన్నాడనే ఆరోపణతో కోర్టులో విచారించడం హాస్యాస్పదం- రాజకీయంగా మమ్మల్ని గుర్తించలేదనే నెపం మరీ అసంగతమైన విషయం- విప్లవ సిద్ధాంతాన్నీ, ఆచరణను వేరుపరచలేం- ఆ రెండూ అవిభాజ్యమైనవి-



రెండోది: ఈ దేశంలో యిప్పుడున్న ప్రభుత్వానికి మామీద నేరారోపణచేసే నైతిక అర్హతలేదు- తిర్థవలస- అర్ధభూస్వామ్యవ్యవస్థ నెలకొనిఉన్న యీ దేశాన్ని పాలించే బడా భూస్వామ్య బూర్జువా వర్గాలకు ప్రజలతో ఎలాంటి సంబంధమూలేదు- దోపిడీదార్ల ప్రతినిధిగా వాళ్ళ నిరంతర దోపిడీ విధానాన్ని యథాతథంగా, శాశ్వతంగా కొనసాగేట్లు చేయడమే యీ ప్రభుత్వం ఏకైక లక్ష్యం. గరీబీహటావ్ అనే బాకా నినాదాలచాటుగా ప్రజలకిచ్చిన కానుకలు: హత్యలు, ఆకలిచావులు ఆకాశాన్నంటే ధరలు, నిత్యం పెరిగిపోతున్న నిరుద్యోగం, విచ్చలవిడిగాసాగే లంచగొండితనం, అబద్ధపు వాగ్దానాల పరంపరలు- ఇట్లా యివి కోట్లలో కొన్ని మాత్రమే- దోపిడీదార్ల కోసం, దోపిడీదార్లచే నడిపించబడే దోపిడీ ప్రభుత్వం కాబట్టి ఇది తన యజమానులకు అంటే దోపిడీదార్లకు చిత్తశుద్ధితోనే సేవచేస్తోంది. ఈ ప్రభుత్వానికి మమ్మల్ని నిందించే అర్హతలేదు-

నక్సల్‌బరీ వసంతకాల మేఘగర్జనకు హడలెత్తిపోయి యీ ప్రభుత్వం విప్లవకారులందరినీ ఎక్కడబడితే అక్కడ కాల్చి చంపి సర్వనాశనంచేసే కార్యక్రమాన్ని చేపట్టింది. ఇప్పటికే వందలాది కామ్రేడ్లు, అందులో ఎందరో కస్టడీలో ఉండగానే దారుణంగా హత్యగావించబడ్డారు. ఇంకెందరో శాశ్వతంగా వికలాంగులు చేయబడ్డారు. సుమారు 32000 కామ్రేడ్లు విచారణలేకుండా అత్యంత హేయమైన పరిస్థితుల్లో జైళ్ళలో మగ్గుతున్నారు- విప్లవ గర్జనలకు హడలిపోయిన యీ పిరికి ప్రభుత్వం తన ప్రజాస్వామ్య ముసుగు సిద్ధాంతాలనుకూడా వదులుకొని దగాకోరు అంతరంగిక భద్రతాచట్టంలోని 17 A నిబంధనను సుప్రీంకోర్టు కొట్టివేసినా ఖాతరు చేయడంలేదు ఈ ప్రభుత్వానికి ఎదురుతిరగడమే సరైనది- ఈ దేశపు ముద్దుబిడ్డల ఎందరివో ప్రాణాలు తీసి పచ్చినెత్తురు తాగిన యీ ప్రభుత్వానికి మమ్మల్ని నిందించేమాట వదలండి: ఎందుకు ఆయుధాలు చేపట్టారు ? అని ప్రశ్నించే అధికారంకూడాలేదు-

మూడోది : ప్రస్తుతం అమలులోఉన్న న్యాయవిధానంనుండి ఏదో న్యాయం ఒడగుతుందనుకోవడం అసంగతమైనవిషయం- ఇది కేవలం ఒక వ్యక్తిగతమైన నీతి, మంచితనానికి సంబంధించిన విషయంకాదు- వర్గాలుగా విడివడిఉన్న సమాజంలో వర్గప్రయోజనాలకు అతీతమైంది ఏదీ ఉండదు- న్యాయస్థానాల నీతినియమాలు ఎలాఉన్నా యీ కోర్టు అర్ధవలస అర్ధభూస్వామ్య భారతరాజ్యాంగంలోంచి ఉద్భవించిందే కాబట్టి

వర్గన్యాయాన్నే చెప్పుతుంది. ఒక కార్యం ప్రజలకు ఎంత మేలు చేసేదైనా అదిగనక పనికిమాలిన ఆ భారత రాజ్యాంగానికి విరుద్ధంగాఉంటే యీ కోర్టు దాన్ని న్యాయవిరుద్ధమైందిగానే నిర్ణయిస్తుంది- ఈ విధానం కొనసాగడానికి తెలిసో తెలియకో ఏవిధంగా తోడ్పడ్డా పాలకవర్గానికి కీలుబొమ్మలుగానే వ్యవహరిస్తారు-

ఇంకా చెప్పాలంటే ప్రస్తుతం యీ కేసులో యిక్కడ ఒకవైపు తుపాకులతో కాల్చడానికి సిద్ధంగాఉన్న పార్లమెంటరీ పోలీసులు, మరోవైపు రాజకీయ కార్యకర్తలుగా గుర్తింపబడలేదనే నెపంతో సంకెళ్ళువేయబడ్డ ఖైదీలు. ఇదంతా ఒక తమాషా- ఇక్కడ న్యాయం జరుగుతుందనుకోవడం హాస్యాస్పదం-

ఈ మాటలతో ఇక నేను ప్రస్తుతాంశానికి వస్తాను- నేను ఏవిధమైన నేరం చేయలేదనేది మొదట చెప్పాల్సిన విషయం- నేరాన్ని నిరూపించాల్సిన బాధ్యత నామీద నేరంమోపిన వాళ్ళపైన్నే ఉంది- కాబట్టి నేను చెప్పాల్సిందేమీలేదు- అయితే నా నిర్దోషిత్వానికి కారణాలుగా కొన్నిమాటలు చెప్పదలచాను- (అవును) ప్రజలకు సేవచేసే నా హక్కును రక్షించుకోడానికి (పూర్వం) ఏ ఆయుధాలు ధరించకపోవడం నా మూర్ఖత్వమే- నేను నా మూర్ఖత్వాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నంచేయను- ఈ కోర్టు విచారణ ఏ సిద్ధాంత ప్రాతిపదికమీద ప్రారంభమైందో దాన్ని కమ్యూనిస్టులమైన మేము గుర్తించం- కాబట్టి నావద్ద ఆయుధాలు ఉండెనోలేదో అనేది అసందర్భమైన విషయం. ఒక న్యాయమైన ఆశయంకోసం ఆయుధాలు చేపట్టడం నేరమని నేననుకోను- న్యాయమైన పోరాటంకోసం ఆయుధాలు చేపట్టడం మనిషినుండి విడదీయరాని జన్మహక్కు- ఈ దేశంలోని శత్రువులనుండి యీ దేశాన్ని కాపాడడానికి మేము ఆయుధాలు చేపట్టినాం. మాది న్యాయమైన పోరాటం. ఈ న్యాయమైన పోరాటంకోసం ఆయుధాలు ధరించడం ప్రతి దేశభక్తుని పవిత్ర కర్తవ్యం. కొద్దిమంది దోపిడీదార్లు, ద్రోహులు మరియు వారి తొత్తులమాత్రమే దీనిని నేరంగా భావిస్తారు- మా ఆశయ సాధనకోసం ఆయుధాలు ధరించడం రాజకీయంగా అవసరం, నైతికంగా సమర్థనీయం, సాంప్రదాయికంగా సరైంది, చారిత్రకంగా అనివార్యమైనది.

సాయుధపోరాటం రాజకీయంగా అవసరం ఎందుకంటే మిక్కుటంగా ఆయుధాలు ధరించి బరితెగించిన కొంతమంది క్రూరుల, పరాన్నభుక్కులనుండి సామాన్యుల కాపాడేందుకు యిదొక్కటేమార్గం- సామ్రాజ్యవాదం, సోషల్ సామ్రాజ్యవాదం, దళారీ పెట్టుబడిదారీ మరియు భూస్వామ్యవిధానం అనే నాలుగు పెనుభూతాల కోరలనుండి ప్రజలను విముక్తంచేయడానికి సాయుధ విప్లవమే ఏకైక మార్గమని ఒక కమ్యూనిస్టుగా, మహత్తర మార్క్సిస్ట్- లెనినిస్ట్ పార్టీసభ్యునిగా నా దృఢమైన విశ్వాసం- ఈ



నాలుగు పెనుభూతాలు ప్రజలవీపులపై నాలుగు పెద్ద పర్వతాల్లాఉన్నాయి- విముక్తికై ప్రజలుచేసే ప్రతి ప్రయత్నాన్నీ వీళ్ళు తమ తుపాకులతో క్రూరంగా అణచివేయడానికే కంకణం కట్టుకొన్నారు- అందుకే ప్రజల సాయుధుల కమ్మని, యీ దేశభవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత వారు శక్తివంతమైన తమ చేతుల్లోకే తీసుకోవాలని వారిని ఉత్తేజపరచాల్సిన అవసరం శ్రామికవర్గ పార్టీకి ఉంది. ఎంత కష్టమైందిగా, కటువుగా కనిపించినా, విముక్తికి మార్గం యిదొక్కటే. పాలకవర్గీయులు తమ రాజకీయ యంత్రాంగంతో, సైనికబలంతో ఎంత అణచాలని ప్రయత్నించినా స్వల్పకాలంలోనే మా పార్టీ సాధించిన అద్భుతమైన ప్రగతిని చూస్తే మా రాజకీయ సిద్ధాంతం ఎంత సరైందో చెప్పకయే చెపుతోంది.

మా ఆశయసాధనకోసం ఆయుధాలు ధరించడం నైతికంగా సరైంది- ఈ దేశంలో పరులకష్టాన్ని దోచుకతినే కొద్దిమంది దోపిడీదార్లను మినహాయించి మిగతా 50 కోట్ల జనుల శ్రేయస్సుకోరే ఎవరైనా మాతో ఏకీభవిస్తారు- ఆయుధాలుకలిగిఉండే హక్కు తామే అట్టిపెట్టుకోవడానికి పాలకవర్గీయులు శాంతిభద్రతల పేరుచెప్పి వాటిని ప్రజలకివ్వడానికి నిరాకరిస్తారు- వర్గసమాజంలో శాంతిభద్రతల ఆశించడం ఒక భ్రమ. అశాంతి, అక్రమం యీ వ్యవస్థ సారసత్వ లక్షణాలు- ఒక మహా కల్లోలం ఒక తీవ్రమైన అశాంతిద్వారానే నిజమైన శాంతి, క్రమం సిద్ధిస్తాయి- ఒక వర్గం మరో వర్గాన్ని దోచుకుంటున్నంతకాలం నిజమైన శాంతి ఉండనేరదు- పీడితవర్గానికి స్వాతంత్ర్యంలేనిశాంతి పాలకవర్గీయుల శాంతి మాత్రమే- అది శవశాంతి తప్ప మరోటి కాజాలదు- ప్రజలచేతిలో ఆయుధాలు దేశంలో శాంతిసుస్థిరతకు ప్రమాదహేతువుకాదు- పాలకవర్గీయుల నిరంతర దోపిడే నేటి యీ అశాంతికి, అస్థిరతకు అసలైన కారణం- ప్రజల సాయుధ తిరుగుబాటు అవకాశాలను మొగ్గలోనే తుంచేసి నిరాయుధులైనవారిని సాయుధంగా దోచుకోడానికి పాలకవర్గీయులు ప్రజల చేతుల్లోని ఆయుధాలు లాక్కుంటారు- కొద్దిమంది స్వార్థపరులు అశేషజనానికిచేసే యీ అన్యాయాన్ని, దోపిడిని, దమననీతిని అంతంచేయడానికే మేము ఆయుధాలు పడుతున్నాం- ఇది నైతికంగా సమర్థనీయం-

మహత్తరమైన యీ ఆశయసాధనకోసం ఆయుధాలు చేపట్టడం సాంప్రదాయికంగా సరైందే- మన ప్రజల చరిత్ర సాయుధపోరాటాల చరిత్ర- 'అహింస' అనబడే పిరికి లొంగుబాటును పాలకవర్గీయులు ఎంత గొప్పచేసి చెప్పినా, ఒక న్యాయమైన ఆశయసాధనకోసం ఆయుధాలు చేపట్టడానికి మన ప్రజలు ఎన్నడూ వెనుకాడలేదు- ఎప్పుడూ వెనుకాడరనేది కాదనలేని సత్యం- ఈ సంప్రదాయం పురాణ యుగంలోని 'ధర్మయుద్ధ'కాలంనుండీ ఉంది- అనేక రైతుతిరుగుబాట్లు, 1857 మొదటి స్వాతంత్ర్య

పోరాటం, స్వాతంత్ర్యం కోసం జరిగిన సాయుధ పోరాటాలు, యింకా అనేకం యీ సత్యాన్ని ఋజువుచేస్తాయి– భారత దేశపు యీ గొప్ప సంప్రదాయాన్ని మేము ముందుకు తీసుకపోతాం–

న్యాయమైన మా యీ ఆశయసాధనకోసం ఆయుధాలు ధరించడం చారిత్రకంగా తప్పనిసరి– ఎక్కడ అణచివేత ఉంటునిదో అక్కడ దాన్ని నిరోధించడం ఉంటుంది– ఎక్కడ సాయుధ దమననీతి ఉంటుందో అక్కడ ప్రతిఘటన ఉంటుంది– ఇది మినహాయింపులులేని సార్వకాలీన, సార్వత్రిక సత్యం– తరతరాల దేశదేశాల చరిత్రలో ప్రజల సాయుధ విముక్తి పోరాటాలు అనివార్యమైనవి– రష్యాలో బోల్షివిక్కుల తుపాకులే చరిత్రగతిని మార్చగలిగాయి– మహత్తర చైనా కమ్యూనిస్టుపార్టీ సరైన నాయకత్వంలో చైనా ప్రజల చేతుల్లోని తుపాకులే వారి దుస్థితిని మార్చగలిగాయి– అలాగే భారత మహాజనుల చేతుల్లోని తుపాకులే మన జాతి దుస్థితిని మార్చగలవు– ఈ చరిత్ర గతిని ఎవరూ ఆపలేరు.

మన ప్రజల జీవితాల్లో దైన్యాన్ని రూపుమాపడం కోసం, ప్రతి వ్యక్తి ఉనికి ఉన్నతమైన అర్థాన్నిపొందే నవభారత నిర్మాణం కోసం, మనిషి మనిషిని దోచుకునే విధానాన్ని అంతంచేయడంకోసం ఆయుధాలు చేపట్టడం మా జన్మహక్కు. ఎన్నిత్యాగాలకైనా సిద్ధమై, మా యీ హక్కును కాపాడుకోడానికే మేము దృఢనిశ్చయంతో ఉన్నాం–

నక్సల్‌బరీలోని ఒక నిప్పురవ్వ నేడు దావానలమై వ్యాపించింది– అది దేశమంతటినీ ఆవరించనున్నది– ఈ సాయుధపోరాటపు తుఫాను యీ వరకే మన రాజ్యాంగపు భ్రమలను ఎగురగొట్టి ప్రస్తుత పాలకుల అసలు వర్గ స్వభావాన్ని, వారి పాశవిక రూపాలను తెరచించి చూపింది– ఇవాళ ఎక్కడ అణచివేతఉందో అక్కడ నక్సల్‌బరీఉంది– ప్రజలకే అది ప్రతిరూపమైంది– ప్రస్తుత కోర్టు విచారణ అనే యీ చిన్న సంఘటనలో కూడా స్పష్టంగా రెండు వ్యతిరేక శక్తులు కన్పిస్తున్నాయి– పాలకవర్గాల దోపిడిని పరిరక్షించే న్యాయాధికారుల తీర్పులన్నీ చరిత్ర చెత్తకుండీలో తీసివేసే రోజు ఎంతో దూరంలేదు– ఈ ప్రపంచం ప్రజలది– ప్రజల విముక్తి పోరాటాలు తప్పక జయించి తీరుతాయి.

ఆయుధాలు ధరించడం మా జన్మహక్కు–

లాల్‌సలామ్ నక్సల్‌బరీకి

కమ్యూనిస్టుపార్టీ (మా లె.) వర్ధిల్లాలి

మహత్తరమైన, సర్రైన చైనా కమ్యూనిస్టుపార్టీ వర్ధిల్లాలి.

చైర్మన్ మావో దీర్ఘకాలం జీవించాలి.

(అనువాదం : లోచన్)

సమీక్ష :

# చైనా కమ్యూనిస్టుపార్టీ 30 సంవత్సరాల చరిత్ర (1921-51)

రచన : హోచియావో మూ

విప్లవరాస్తా మాస్కో– షాంఘై కలకత్తా లగుండా వెళుతుందన్నాడు లెనిన్. రష్యా అక్టోబరు విప్లవం తరవాతే చైనాలో కమ్యూనిస్టుపార్టీ ఏర్పడింది. చైనాలో దీర్ఘకాలిక సాయుధపోరాటం విజయవంతమవుతుండగానే భారతదేశంలో తెలంగాణా రైతాంగం బందూకు పట్టింది. కాని తుపాకిని భుజం మార్చుకోవడానికిబదులు సొంతం కింద పెట్టేసింది ఆనాటి కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం. భారత విప్లవం ఒక్కతరం వెనక్కి పోయింది. అదంతా గతం.

1967లో నక్సల్‌బరీలో విప్లవం ఏరువాకగా సాగింది. 1968లో విప్లవ వాహిని శ్రీకాకుళంలో వరవళ్ళుతొక్కింది. నక్సల్‌బరీలో సాగిన ఏరువాకకు స్వాగతంచెప్పిన కీర్తి చైనాపార్టీ దక్కించుకుంది.

విప్లవం విదేశాలనుంచి దిగుమతిచేసుకునే సరుకుకాదు. దేశంలోని పీడిత ప్రజలు కలిసికట్టుగా పోరాడి ఎన్నో త్యాగాల జ్వాలలతో గెల్చుకునే రాజకీయ అధికారం. కాని ఏ దేశపు విప్లవ కార్యాచరణ అయినాసరే అన్ని దేశాల కష్టజీవులకు, కమ్యూనిస్టు పార్టీలకు ఉత్తేజం కలిగించుతుంది. ఎదటివారి అనుభవాలనుంచి గుణపాఠాలు నేర్చుకోలేకపోవడమే తప్పు. అందుకే చైనాపార్టీ చరిత్ర ప్రతి విప్లవకార్యకర్త, ప్రతి ఉద్యమకారుడు తప్పకుండా చదివి తీరవలసిన పుస్తకం. అయితే వెనకటికి ప్రెంచిక విఅన్నట్టు రాటబల్ల మీ ఊరెటువుందో చెబుతుందేగాని తానే ఆ ఊరెళ్ళదు. మీ ఊరు నువ్వెళ్ళవలసిందే. అలాగే చైనా విప్లవం మన భారతవిప్లవానికి ఒకరకంగా ఒరవడి. అయితే మన విప్లవాన్ని మనమే సాధించుకోవాలి– మీ ఊరు నువ్వే వెళ్ళవలసినట్టు.

ఇది విమోచన ప్రచురణలవారు తెలుగుదేశానికి అందించిన తొలికానుక. చైనా కమ్యూనిస్టుపార్టీ చరిత్ర క్లుప్తంగా, చక్కగా, చిక్కగా విడమర్చి రాశారిందులో. చైనా విప్లవ విశిష్టత ఏమిటి? తూర్పుదేశాల్లో విప్లవాన్ని ఎలా నిర్వహించాలి? వీటన్నిటికి గోసాయి చిటా[illegible] దీనిలో లేవు. కాని [illegible]ంచవలసిన అంశాలు [illegible] కోకొల్లలు.

చైనాపార్టీ చరిత్రను మొత్తం 4 దశలుగా విభజించారు. 1. పార్టీ స్థాపన 2. అంతర్యుద్ధం. 3. జపాన్ వ్యతిరేకయుద్ధం. 4. అంతిమ పోరాటం.

చైనా పార్టీ స్థాపనకు 1919 మే 4 ఉద్యమం ఎంతో తోడ్పడుతుంది. చైనా ప్రత్యేక పరిస్థితులను పసిగట్టి వాటికి అనుకూలంగా తమ కార్యాచరణను రూపొందించుకోవడంలో చైనాపార్టీ పిలదొక్కుకుంది. అలాగే ప్రపంచ శ్రామిక మహానాయకుడు స్టాలిన్ అడుగడుగునా తమకిచ్చిన అమూల్యమైన సూచనలను గురించికూడా ఇందులో ఎక్కువగా రాశారు. ఆ మహనీయుడు నిర్వహించిన చారిత్రిక పాత్రను మసిబూసి మారేడుకాయచేసే నేటి రష్యా నాయకత్వపు విషప్రచారానికి విరుగుడు మనకు దీనిలో కనిపిస్తుంది. జపాన్ వ్యతిరేక యుద్ధంలో ఐక్యసంఘటన అవసరమయింది– ఐతే Strike together but march seperately అన్న స్టాలిన్ సూక్తి ముఖ్యంగా ఐక్యసంఘటన విషయాల్లో కమ్యూనిస్టులం మర్చిపోగూడదు. అంతిమ పోరాట సమయాల్లో చైనాపార్టీ ఎన్ని ఇబ్బందులకు, ఇక్కట్లకులోనయిందో యీ పుస్తకం కళ్ళకు కట్టింది. సిద్ధాంతాన్ని, ఆచరణను ఎంతో ఒడుపుగా మావో మేళవించాడని యీ పుస్తకం చెబుతుంది. అయితే మహాప్రస్థానం(Long March) గురించి ఏమీ చెప్పకపోవడం ఇందులో పెద్దలోపం.

కర్ణుడు లేని భారతం అన్నట్టు లాంగ్‌మార్చ్ ప్రసక్తిలేని చైనా పార్టీ చరిత్ర సంపూర్ణంకాదు.

ఇది పరిశోధకుల కోసం రాసిన పుస్తకం కాదు. విప్లవమే తమ ఊపిరనుకునే కార్యకర్తలకోసమే యీ చిన్న పుస్తకం. కట్టె, కొట్టె, తెచ్చె లాగా చైనా పార్టీ చరిత్రను ఆసక్తిగా అందచేసే ఈ పుస్తకం అనువాదం చాలా సరళంగా, సాఫీగా ఉంది.

— చలసాని ప్రసాద్

---

చైనా కమ్యూనిస్టుపార్టీ 30 సంవత్సరాల చరిత్ర (1921-51)

రచన: హోచియావో మూ — వెల: 1–75

విమోచన ప్రచురణలు,
3-9-117, హనుమకొండ,
వరంగల్ – 506001.

---

రాజకీయ

# వీధి భాగోతం

ఏ. బి. గద్దర్

1. జీతగాడు
2. పట్వారి
3. భూసామి (దొర)
4. రైతు– 1
5. రైతు– 2

జీతగాడు, ప్రవేశం :

మల్లిగాన్నినేను– దొరజీతగాన్ని నేను ॥మ॥
దొరనోటికిమొక్కాలె– దొరచేతికిమొక్కాలె ॥దొ॥
దొరకేమన్నా ఎదురుజెప్పితె ॥దొ॥
పక్కలిర్గదన్ని పోలీసుకిస్తడు ॥మల్లి॥
తై......

ఇనాముకిందేమో– నాకు మాన్యంఇచ్చాడు ॥ఇ॥
అందాలుదప్ప– అందులో ఏమిపండవన్నా ॥అం॥
అమ్మకుందమంటే– నాకు హక్కులేదంటా ॥అమ్మ॥
పన్నుగట్టేది నావాంతె– పట్టనేమొ దొరపేరటున్నది ॥మల్లి॥
తై...

పనిజేసేది నావాంతు– సుఖపడేది దొరవాంత ॥ప॥
కష్టమొచ్చి దొరవారికిచెప్పితె ॥క॥
కాల్లుమొక్కేదాక పైసాఇవ్వడు ॥మల్లి॥
తై...

సుక్కపొద్దునుండి– నడిజామురాత్రిదాకా ॥సు॥
సుట్టదాగనీకి తీరికలేక– ఎదురుజెప్పక ఎట్టిజెయ్యాతె ॥సు॥
తిన్నావా అని యెన్నాడడ్గడూ– తన్నీతన్ని పనిదీసుకుంటడు ॥మల్లి॥
తై...

అవురాకున్ననాతప్పే- అదిముందునొస్తెతప్పె ॥అ॥
పిల్లలేడ్చిన నాతప్పే- బడికిపోకున్న నా తప్పె ॥పి॥
అత్త మీదికోపం దుత్తమీదదీసినట్టు ॥అ॥
అటుఇటుపోయి నన్నెదిడ్తడు ॥మల్లి॥
తై...
సారలుదేవాలె- దొరకు కల్లుదేవాలె ॥సా॥
సారాకల్లుదాగి సంతోషంగా ॥సా॥
దొరవారు సరసాలుసలిపితె
ఖాలీసీసలు కడిగిపెట్టాలె ॥మల్లి॥
తై...
కోళ్ళుతేవాలె- దొరకుకోసిపెట్టాలె ॥కో॥
బియ్యందేవాలె- దొరకు బిర్యానిఒండాలె ॥బి॥
కడ్పునిండ దొర దిన్నాతర్వాత ॥క॥
ఖాలీబొగోనులు కడ్గిపెట్టాలె ॥మల్లి॥
తై...
మంచిబట్టగడ్తెతప్పె- కడ్పునిండాదిన్నతప్పె ॥మ॥
జీతగానికి మదం బెర్గెనని ॥జీ॥
అదనుజూసుకొని హరిగోసబెడ్తడు ॥మల్లి॥
తై...
చలిల వొనుకుకుంట- దొరచేనుగాయాలె ॥చ॥
తప్పిదారి ఇంటికాడపండితే ॥త॥
వొంగబెట్టి- పెద్దబండా ఎత్తుతడు ॥మల్లి॥
తై...
ఆసేయ్‌తసేయాని- నాపెండ్లాన్ని తిడ్తాడు ॥ఆ॥
ఏమెగీమె అని- నా చెల్లెనిచూస్తాడు ॥ఏ॥
ఆల్లాపిల్లలను- ఆటుజరుగంటే ॥ఆ॥
బెత్తమిరిగెదాగ- కట్టేసిగొడ్తడు ॥మల్లి॥
తై...
గిర్దావారిగాడు గుర్రిమంటడు- పట్వారిగాడు
వండ్లుగొర్కుతడు ॥ప॥



మాకెలాడె అని అమీన్‌దిడ్తడు కోర్కెలాడె అని
మోరీల్‌దిడ్తడు ॥మా॥
అబ్బ నాజీవికి సుఖమాడుంది ॥మల్లి॥
తై... (వెళ్ళిపోతాడు)

పట్వారి : (ప్రవేశం)

ఈవూరికినే పట్వారినిరా
నానామము కనకయ్యందురురా ॥ఈవూ॥
తై...
మన్నెమస్కుర్- పీరుడిబ్యాగరి ॥మ॥
కమ్మరి కుమ్మరి- చాకలిమంగలి ॥క॥
కిదర్‌గయే బే హాజర్‌హోజావ్-
తై...
దొరవారికి నే కుడిభుజమునురా ॥దొ॥
పదిఊర్లకు నే పట్టెదారును ॥ప॥
దొరలేకుంటె నేనె దొరనురా ॥దొ॥
నేనురాసిన కలిపిరాతను, విప్పెదిదెవె మొనగాడెలేడురా- ॥నే॥
తై...
భువనగిరి- భూస్వామిగారురా ॥భు॥
దయతోనేడు దొరకెళ్ళినడు ॥ద॥
కల్లుసార- కోళ్ళుమేకలు ॥క॥
బ్రాందీవిస్కి- బగారుఅన్నం ॥బ్రా॥
ఎక్కడివక్కడ- తయారుబెట్టుడి ॥ఎ॥
ఒంటలరామిని- ఒండిపెట్టుమను ॥ఒ॥
రంగసానిని రమ్మనిచెప్పు-
తై...
గాయిద్దాన్ని, వాకిలూడ్వమను ॥గా॥
పీరుడుకొడుకును- నీళ్ళుదెమ్మను ॥పీ॥
తలాదిదోన్ని- కోళ్ళుదెమ్మను ॥త॥

చాకలిదాన్ని- బట్టలుత్కమను ॥చా॥
ఒడ్లశంభని- కుర్చిదెమ్మను ॥ఒ॥
ఏ కొడుకన్నా- ఎదురుజెప్పితె ॥ఏ॥
ఏడుచెర్లలిల్లు- దాగిస్తానను-
తై...
పన్నుగట్టని- పాపిగాన్నిరా ॥ప॥
తన్నుకుంట- చావిడికితెండ్రిరా ॥త॥
లేకితకావి- దొరమామూల్లా ॥లే॥
లెక్కబెట్టి- నానూలుచేయుడి-
తై... (వెళ్ళిపోతాడు)

దొర : (భూస్వామి)

భువణగిరి- భూస్వామినిరా
నా పేరూ- వెంగళరావురా ॥భు॥
పిడిల్ పిడిల్- నాపిల్లలుదిన్నా
తరగనిధనము- వున్నదిరా ॥పిడి॥
పట్నంలో పతి- ఫాక్ట్రీలున్నయ్
బ్యాంకులోకోట్ల- రూపాలున్నయ్ ॥పట్న॥
తై...
నూరుమంది- నాజీతగాళ్ళురా
వూరుకు నే- దొరవారునిరా ॥నూ॥
నా పేరుజెప్పితే- కూలికొడుకులు
గడగడవణ్ణికి- పోదురూ ॥నా॥
తై...
నా కెదురుతిరిగిన- కూలిరైతులను
నిలువుత పాతి- చంపినరా ॥నా॥
తై...
తయిసిల్దార్- నా తమ్ముడురా
అమీన్‌సాబ్- నా అల్లుడురా ॥తై॥



ముఖ్యమంత్రి- నా మర్దలుమొగడు
కలెక్టరు- మాకాకయ్యే ॥ము॥
తై...
నాకు తక్కువేమున్నదిరా
నాకు ఎదురు- యేమున్నదిరా ॥నా॥
సుందరాంగి- ఇందిరపుణ్యాన
సుఖముగ హాయిగా- ఉన్నానురా ॥సుం॥
తై...

రైతులు : (ప్రవేశం)

రైతు: కరుణించుడోదొరవారు
నీకు శరణుచేసెద దొరవారు ॥క॥
పంట పండకపోతె- పన్నేలగట్టేము ॥ప॥
మెతుకులెరుగనివాళ్ళు మిత్తేలగట్టేరు ॥మె॥
గడ్డిలేక ఎడ్లు- గద్దలపాలాయె ॥గ॥
విత్తనాలాకన్న- పదిఇత్తులురాలె ॥కరు॥
తై...

పట్వారి: పన్నుగట్టకుంటె- ప్రాణిందీస్తంరా ॥ప॥
అలినమ్ముకోని భడివె- అప్పుదీర్చుకోరా ॥అ॥

రైతు: మీబిడ్డె పెండ్లికి- పుట్టెడొడ్లుబోస్తి ॥మీ॥
పైసాకాసాబడక- పొలమంతదున్నిస్తి ॥పై॥
గడియపురుసతులేక- గడ్డాముబెట్టిస్తి ॥గ॥
కొమ్మకొమ్మగొట్టి- కొట్టాగట్టిస్తి ॥కొ॥
ఎన్నిచేసిననీకు- దయరాదు ఏమయ్య ॥కరు॥

దొర: హద్దుబద్దులేక- కొడకా వాగుతుంటివేలా ॥హ॥
ఒరిగంజిదాగిమీకు- వొళ్ళుబల్సినదిరా ॥ఒ॥
గడిలో బాతినపో- నీకు గప్పుడుతెల్సునురా ॥గ॥
తై...

రైతు: ఆలి అక్కా-అన్న- నోరువిప్పకపోతి ॥ఆ॥
అప్పుగట్టక ఎన్ని- చెప్పుదెబ్బలుతింటి ॥ఆ॥
ఏటేట మామూళ్ళు- సూటిగచెల్లిస్తి ॥ఏ॥
లేకి తకావీలు- లెక్కబెట్టికట్టి ॥కరు॥
తై...

పట్వారి: అప్పుఐనదాని సాలె- కాళ్ళుబట్టుకోరా ॥అ॥
తై...

రైతు: కరుణించి దొరవారు- కాపాడవేమయ్య ॥క॥
కరుణించి మాపైన- దయచూపవేమయ్య ॥క॥
కోరినప్పుడల్లా- కోడిపుంజులుఇస్తి ॥కో॥
మీబిడ్డ పురుడుకు- మేకపిల్లాలిస్తి ॥మీ॥
గవ్వకాసావడక- గొంగళ్ళు పంపిస్తి ॥గ॥
మా ప్రాణములుదప్ప- మాదగ్గరేముంది ॥కరు॥

దొర: నాకాల్లు మొక్కుకుంటె- మీకదుపేనిండదురా ॥నా॥
కూలినాలినంత నీవు- కూడదీస్తివంట ॥కూ॥
కూలినాలిలు ఏకమయ్యి- నా ఈకెటీకలేరు
తై...

రైతు: నీ ఎడ్లుగానేది- పేదపర్రిజలేగాదా ॥నీ॥
నీ బంగ్లగట్టింది- కూలిపర్రిజలేగాదా ॥నీ॥
బంజేరుదున్నేది- కూలిరైతులెగాదా ॥బం॥
మందిశక్తిముందు- ఏ శక్తినిలువాదు ॥మం॥
మందిదల్చుకుంటె- ఏదన్నజేస్తారు ॥కరు॥

దొర: నోరుకావ్వినదిరా- ఓరి చావుమూడినదిరా ॥నో॥
ఒక్కతన్ను కె రక్తంకక్కి- నేలకొరుగుదువురా

(ఒకరైతు గుండెపై తన్నుతాడు గాబరాగా పట్వారితో వెళ్ళిపోతాడు)
(ఆరైతు రక్తంగక్కుకుంటాడు. మిగతా ఇద్దరు అతన్ని సరిచేస్తారు)

1. రై: వ॥ నియవ్వ ఏందిరాసూశేది. తాడోపేడో తేల్చుకోక-



2. రై: వ॥ మాటలు కోటలుదాటుతయిగని, కాళ్ళు తంగెళ్ళుదాటవాయె

3. రై: వ॥ దొరను బెదిరించి మన సంఘానికి ఇంత జుర్మానాదీస్తుంటె సరిపోదురా- ఉర్కులాడ్తె పనైతదా-

1. రై: వ॥ సైసొసె; వీడైతె పాముసావొద్దు, కట్టె ఇరుగొద్దు అంటడు. మల్లిగానిఫెండ్లాన్ని దొరోడు మంచెకాడ గుంజులాడినప్పుడు గూడ గిట్లనే నరికిండు. రైతుసంఘంబెట్టుకుందామని సెప్పిన రామయ్య సిన్నకొడుకు యెల్లేశను బాగాదాగిపిచ్చి, బాయిల నూకించి సంపించిండు దొర- అప్పుడు అమీన్, సర్కిల్ మోరీల్ ఎల్లిగాడు మల్లిగాడు తెడ్డుగాడు ఎందరోవచ్చిరి, అగ్గర్లగూడ ఏసిరి. దొర కావల్సినంత రకంగుమ్మరిచ్చి మల్ల రాజిర్కం ఏలవట్టె. యెన్నిఐనా మనకు శిగ్గేలేదొన-

2. రై: వ॥ అరేయ్! తెగిడితోడికి తెడ్డెలింగమొన, ఇయ్యాల ఆ దొరోని సంగతేందో తెల్చుకుందాం!

1. రై: వ॥ ఐతె సభజేస్దాంపటురా!

రైతు: సభజేయుదామా ఇప్పుడు- ఓ రైతులారా కూలిలారా ॥స॥
అధికారం తన- చేతులుందని ॥అ॥
మంత్రుల మద్దతు- చాలఉందని ॥మం॥
ఇష్టామొచ్చిన్నట్టాడుతున్నడు ॥సభ॥
ఊరికివచ్చిన- మందులన్నిరా ॥ఊ॥
తనపొలాలకె- తరిలించిండు ॥త॥
చెరువుకువచ్చిన- మరమ్మతు పైసలు ॥చె॥
సప్పుడుజెయ్యక- మింగికుకుండు ॥స॥
పాపమంటె మన- పనిబట్టదురా ॥సభ॥

1.2.3. రైతులు: పద! పదొసె! నడువ్! లేవండి! పదండి!!!

రైతు: లెండిరా రండివేగమే
ఓ రైతులారా- కూలిలారా ॥లెండి॥
కాశెబోసుకొనీ- కత్తినూరుకొని ॥కా॥

గొడ్డండ్లు- గొంగళ్లెబెట్టుకొని ॥గొ॥
బాకుబల్లెములు- చేతబట్టుకొని ॥బా॥
చేతికిదొరికిన- వాటినందుకొని ॥చే॥
అన్నలార- ఓ తమ్ముల్లారా ॥అ॥
అదనుదొరికినది- ఆగబోకుడి ॥అ॥
దొరవారి గడిసుట్టు ముట్టుడి- ॥లెండి॥
(దొర గడి చేరుతారు-)

రైతు: అరేయ్!
కష్టజీవులంరా- నిన్ను కాల్చుకతింటంరా ॥క॥
కూలిరైతులంరా- నిన్ను కోసుకతింటంరా ॥కూ॥

దొర: కరుణించుడో- రైతులారా
నన్నుకాపాడు- దో కూలిలారా
మన్నించి ఈసారి- నన్నొదిలివేయండి ॥కరు॥

రైతు: ఒగలమాటలోరి- నీవు ఇంక వొద్దులవేమి ॥వొ॥
నర్కం స్వర్గం మాకువొద్దురా-
నిన్ను నరికితెనె మాకుసుఖంరా ॥కష్ట॥

దొర: దొరఅంటె ఊరికి- దేవునిలాంటోడు ॥దొ॥
కరుణించి ఈసారి- నన్నొదిలిలేయండి ॥దొర॥

రైతు: కోటలోనజొచ్చి- నీ తీటవాపుతంరా ॥కో॥
గవినికుక్కలు అడ్డంవచ్చిన ॥గవి॥
తోలుదీసి తొండాలుజేసెదము ॥కష్ట॥

దొర: అమీన్‌గారు- నాకండగున్నరు ॥అ॥
కాంగ్రెసువారు- తోడుగున్నరు కాం॥
హత్యకేసుబెట్టి- హరిగోసబెడ్త ॥హ॥
జన్మఖైదుజేసి- జైలుకు బంపుత ॥కష్ట॥

రైతు: అమీను దిగిరాని- అమీను తాతలుదిగిరాని ॥అ॥
ఇందిరాగాంధి అడ్డమొచ్చిన ॥ఇం॥
గడ్డపారలతొ పొడిచి సంపెదము ॥కష్ట॥



దొర: మాన్యమిత్తు మీకు- మక్త లిత్తుమీకు ॥మా॥
కల్లుకుండలుమీకు- కరుణతొపంపిద్దూ ॥క॥

రైతు: మాన్యమొద్దుమాకు- నీ మక్త లొద్దుమాకు ॥మా॥
బటువులొద్దుమాకు- నీ బంగ్లలొద్దుమాకు ॥బ॥
కావాలె నీ ప్రాణమొకటే- ॥కష్ట॥
తల్చుకోర నీ తాత తండ్రులను ॥తల్చు॥
కొల్చుకోర నీ ఇష్టదేవతల ॥కొల్చు॥
పిల్చుకోర పోలీసుకొడుకులను ॥పిల్చు॥
తెచ్చుకోర సియార్పి కొడుకులను ॥తెచ్చు॥
హరి బ్రహ్మాదులు అడ్డమొచ్చిన ॥హరి॥
గడ్డపారలతొ పొడిచి సంపెదమూ-

(దొరను అందరుకలిసి చంపేస్తారు- నెత్తురుచేతులు పైకెత్తి)

వ: పదొసె! ఇంగ అడువుల్లకెల్లి మనోల్లతో కలుద్దాం! ఈ ధోకబాజి ఫెటుత్వంతో కలెబడుదాం!

రండి ఓ రైతులారా- జనసేనలోచేర
రండి ఓ కూలిలారా ॥రండి॥
లెండిరా రండి- జనసేనలోచేరండి ॥లెం॥
ఇందిరమ్మ సేనలతో- పోరుసేయగారండి ॥రం॥

*****

— బంతి ఎంత గట్టిగా కొట్టితే అంతపైకి ఎగిరేటట్టూ నిర్బంధాలు కొనసాగిస్తున్న కొద్దీ ఉద్యమం పెరుగుతూనే వుంటుంది.

— "భూస్వాముల, దళారీ బూర్జువాల, అమెరికా రష్యా సామ్రాజ్యవాదుల దోపిడీకి గురియై రోగ పీడితమైన యీదేశ ఆర్థిక రాజకీయ వ్యవస్థకు మా విప్లవం శస్త్ర చికిత్స-

వివేకం ఉన్నవాడెవ్వడూ శస్త్ర చికిత్స నేరమనికాని, సర్జన్ నేరస్తుడనిగానీ అనడానికి సాహసించడు"

అరెస్టులు – ఖండనలు :

## పాలకవర్గపు కుట్ర

ఏర్ కండీషన్డ్ రూముల్లో కూచోని
రోజుకో కుట్ర చేస్తున్న మీరు
మీ కుట్రలను నిమిష నిముషం
బద్దలు కొడుతున్నారని చెప్పి
మావాళ్ళపై కుట్రకేసులు పెట్టార్రా
విప్లవం కుట్ర కాదురా
వీరుడుగా చావడం కుట్ర కాదురా
అయినా ప్రతిసారి అరెస్టులు చేయడం
అవమానాలు పొందటం మీ కలవాటేలే
మీరు చేస్తున్న కుట్రలను
ప్రజా కోర్టుల్లో విచారించే రోజులు
ఇంకా ఎన్నో రోజులు లేవులే! — ఉదయ్

(వరవరరావు, చెరబండరాజులను అరెస్టు చేసిన సందర్భంలో వ్రాసినది)

## కడలి తరగల నాపగలవా వెంగళ్రావ్ !

అల్లప్పుడు తెలంగాణాలోనూ మొన్న మొన్న శ్రీకాకుళంలోనూ విప్లవవీరులను పొట్టనపెట్టుకున్న వెంగళ్రావ్ మరోసారి విప్లవ రచయితలపై దాడిచేశాడు.

విరసం ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ త్రిపురనేని మధుసూదనరావ్, 'సృజన' సంపాదకులు కామ్రేడ్ వరవరరావ్, 'పిలుపు' సంపాదకులు కామ్రేడ్ రంగనాథం, 'పిలుపు' నిర్వాహకులు కామ్రేడ్ ఎం.టి. ఖాన్, విప్లవకవి కామ్రేడ్ చెరబండరాజులపై కుట్రకేసు బనాయించింది ప్రభుత్వం.

విప్లవాలు సుదీర్ఘ సాయుధ ప్రయాణాలు. అందుకే అవి ధనబలంతో ఎన్నికై మారణాయుధాలబలంతో సాగించే రాక్షసపరిపాలనకు వ్యతిరేకంగా ముందుకుసాగుతాయి. వాటితోపాటు విప్లవ సాహిత్యం సాగి తీరుతుంది. రచయితలపై జరుగుతున్న యీ దాడులను ఖండించవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ,

విప్లవాభినందనలతో
విప్లవ రచయితల సంఘం,
విశాఖ.



## "విప్లవ రచయితలపై ప్రభుత్వ కుట్ర"

"విరసం ముఖ్యులు, విప్లవ రచయితలు టి. మధుసూదనరావు (కార్యదర్శి) కె.వి. రమణారెడ్డి, వరవరరావు, చెరబండరాజు, ఎం.టి. ఖాన్, (కార్యవర్గసభ్యులు) రంగనాథం (పిలుపు ఎడిటర్) తదితరులను అరెస్టుచేసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరోసారి తన ఫాసిస్టు, ఫ్యూడల్ పాలనావిధానాన్ని బయటపెట్టుకుంది.

విప్లవ సాహిత్యాన్ని తొక్కిపట్టడమేగాకుండా, విప్లవ రచయితల గొంతులను అడ్డుకోవాలని, సానుభూతిపరులను భయభ్రాంతులను చేయాలని ఈ పాలకవర్గం కొత్త పథకాలు వేస్తూవుంది. అందులో భాగంగానే విరసం ప్రముఖులను యితర 40 మంది కామ్రేడ్సుపై కుట్రకేసు బనాయించి ప్రభుత్వం ప్రజారచయితలపై కుట్రపన్నింది. ఈ దళారీ బూర్జువా పాలకవర్గం అమలుజరుపుతున్న అనాగరిక–ఫాసిస్టు దమనకాండను తీవ్రంగా ఖండిస్తూ యీ కుట్రకేసును ఎత్తివేయాలని కామ్రేడ్సందరిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాము."

నిఖిలేశ్వర్,
జ్వాలాముఖి.

## సూర్యోదయం కుట్రకాదు ! విప్లవ రచయితలు కుట్రదారులుకారు !

విరసం కార్యదర్శి త్రిపురనేని మధుసూదనరావు, విరసం కార్యవర్గ సభ్యులు చెరబండరాజు, విరసం కార్యవర్గసభ్యులు, సృజన సంపాదకులైన వరవరరావు, విరసం కార్యవర్గసభ్యులు, పిలుపు పత్రిక ప్రచురణకర్త ఎం.టి. ఖాన్, అదే పిలుపు పత్రిక సంపాదకులు ఎం. రంగనాథం, భారత చైనా మిత్రమండలి ఖమ్మం జిల్లాశాఖ కార్యదర్శి వి. కోటేశ్వరరావుగార్లను ప్రభుత్వం అరెస్టు చేసింది. విప్లవ రచయితల్లో ప్రముఖ వ్యక్తుల్ని అరెస్టుచేసి తద్వారా విరసాన్ని నిషేధించకుండానే రూపుమాపాలని ప్రయత్నిస్తోంది. విరసం అంటే యీ కొంతమంది వ్యక్తులేనని భావిస్తోంటే, అది దాని భ్రమ, తెలివితక్కువతనం మాత్రమే!

ప్రభుత్వ సంకెళ్ళని బద్దలుకొట్టి, కుట్రకేసులో అరెస్టుకాబడ్డ మన తోటి కామ్రేడ్స్‌ని విడిపించుకోవలసిన బాధ్యత మనపైవుంది. అందుకు సమాజంలోని అన్ని పీడిత వర్గాలు, ప్రజాసంస్థలు, కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావి, రచయితలు, ఉద్యోగులు ఏకమై ఒక నిర్మాణాత్మకమైన పోరాటాన్ని కొనసాగించవలసిందిగా విరసం విజ్ఞప్తి చేస్తూంది. అరెస్టయినవారిని వెంటనే విడుదల చేయవలసిందిగా ప్రభుత్వాన్ని విరసం డిమాండ్ చేస్తూంది.

విప్లవ రచయితల సంఘం,
నగరశాఖ, హైదరాబాద్.

## జైళ్లు విప్లవాన్ని బంధించలేవు

సాయుధ పోరాటం ఏకైక మార్గమని కర్తవ్యబోధ కావించే ప్రజా రచయితలను బంధించింది పిరికి ప్రభుత్వం. కలాలకు సంకెళ్లులేవని తన దోపిడీ కోర్టు ఇచ్చిన తీర్పునే కాలరాస్తూ వరవరరావు, చెరబండరాజు, యం. టి. ఖాన్, త్రిపురనేని మధుసూదనరావులను అక్రమంగా అరెస్టు చేసింది. ఔను– కార్మిక కర్షక యోధులందరూ కలిసి నిర్మించే సమతాస్వర్గం కోసం సాయుధంగా తిరుగబడే వాళ్లంతా ఖైదీలు! స్వతంత్ర భారత ప్రభుత్వ ఖైదీలు!

అరెస్టులవల్ల విప్లవాలు ఆగిపోవు
దోపిడీ జైళ్లు బంధించలేవు విముక్తిని

జన చైతన్యాగ్నిని ఆర్పజూచే మూర్ఖ ప్రభుత్వం శలభంలా మాడిపోక తప్పదు–

ప్రొగ్రెసివ్ యూత్ ఫ్రంట్, నర్సంపేట

## 'అక్షరాల్లో ఆలోచనల్ని బంధించనీకండి భావస్వేచ్ఛను కటకటాల్నుంచి బతికించుకోండి'

రచయితల్ని అరెస్ట్ చేసి, విప్లవ భావస్వేచ్ఛకు అంతరాయం కల్పించాలని, ప్రాథమిక హక్కులైన వాక్స్వాతంత్ర్యం, భావస్వాతంత్ర్యాలకు సమాధికట్టున్నదీ బూటకపు ప్రజాస్వామ్యం. తమ బూర్జువా కోర్టులే రచయితలను అరెస్టుచేయడం చట్ట వ్యతిరేకమనీ, భావస్వేచ్ఛకు అఘాతం కల్పించడం రాజ్యాంగవిరుద్ధమనీ ఎన్నోసార్లు తీర్పుచెప్పి అరెస్ట్ అయిన రచయితల్ని విడుదలచేయించినవి. మళ్ళీ వరవరరావు, చెరబండరాజు, ఎం.టి. ఖాన్, త్రిపురనేని మధుసూదనరావు, వి. కోటేశ్వరరావులను అరెస్ట్ చేసింది. తనని పడగొట్టాలనే కుట్రతో సంబంధం వున్నట్లు ఆరోపిస్తూ! కేవలం దౌర్జన్యచర్యలపై ఆధారపడ్డ యీ ప్రభుత్వపు దుశ్చర్యను మహబూబ్‌నగర్ విరసం యూనిట్ తీవ్రంగా నిరసిస్తూంది. ప్రతిపౌరుడూ తమ హక్కులరక్షణకొరకు పోరాటం చేయాల్సిందిగా, మేధావులూ, రచయితలూ, కవులూ యీ దోపిడీ ఫాసిస్ట్ ప్రభుత్వం అసలురంగును బట్టబయలుచేయాల్సిందిగా యూనిట్ పిలుపునిస్తూంది. అరెస్ట్ చేసిన రచయితల్నందర్నీ వెంటనే విడుదలచెయ్యమనీ డిమాండ్ చేస్తూందీ యూనిట్–

కన్వీనర్,
మహబూబ్‌నగర్ విరసం యూనిట్



## జైళ్లను నమ్ముకొని పాలించే ప్రభుత్వమా – అరెస్టులు నీ పతనాన్ని ఆపలేవు

విప్లవ రచయితల సంఘం ప్రారంభమైన నాటినుండి విప్లవ సాహిత్యాన్ని నిషే ధించడం, రచయితలను అరెస్టు చేయడం ప్రభుత్వానికి వృత్తిగా తయారైంది. అంత మాత్రాన రచనలు చేయకుండా రచయితల నాపడం అసాధ్యమని ఈ మూడేళ్ళచరిత్రలో ప్రభుత్వానికి తెలిసివుండాలి. అయినా ఈనెల 18వ తేదీన విప్లవ రచయితల సంఘ ప్రధానకార్యదర్శి శ్రీ మధుసూధనరావు, 'సృజన' పత్రికా సంపాదకుడు శ్రీ వరవరరావు 'సిలువ' పత్రికా సంపాదకుడు ఎం. టి. ఖాన్, ప్రఖ్యాత రచయిత శ్రీ చెరబండరాజు గార్లపై ఒక కుట్రకేసు బనాయించి, తిరిగి వారిని నిర్బంధంలోకి తీసుకోవడం ఈ ప్రభుత్వ స్వభావానికి నిదర్శనం. అవినీతి అధిక ధరలు, దారిద్ర్యం, నిరుద్యోగం మొదలైన రోగాలతో పుచ్చిపోతున్న ఈ పరిపాలనను పెకిలించి వేయటానికి విప్లవం ఏ మూలనుండి వస్తుందోనని కంగారుపడుతున్న ప్రభుత్వానికి ఏవైపుజూచినా విప్లవం నడిచి వస్తున్నట్లు భయం కలగటం సహజం. ఆ విప్లవానికి కారణం పుస్తకాల్లో, అక్షరాల్లో కనిపించి కంపరం పుడుతుంది గాబోలు, రచయితలను చీటికీమాటికీ అరెస్టు చేస్తూంది. కాని, దోపిడీ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే ఓ ప్రభుత్వమా! విప్లవం అక్కడకాదు పుడుతున్నది– నీవు మాడుస్తున్న కడుపుల్లో పుడుతూంది విప్లవం, నీవు దోస్తున్న సంసారాల్లో పుడుతూంది విప్లవం. నీవర్గం దాస్తున్న ధనరాసుల్లో పుడుతూంది విప్లవం. నీ పుచ్చిపోయిన పరిపాలనలోనేవుంది విప్లవానికి బీజం. ఇంకెక్కడో వెదికి ఏంలాభం? కాబట్టి అరెస్టులుచేసి విప్లవాన్ని ఆపలేవు. అరెస్టులు ఆపమని నిన్ను మేమడగటంలేదు. ఎందుకంటే– అరెస్టుచేయటం నీ స్వభావం గనుక. కాని, ఈ అరెస్టులవల్ల నీ స్వభావాన్ని నువ్ బయటపెట్టుకొని, ప్రజలను రెచ్చగొట్టి, నీ మరణాన్ని దగ్గరికి జరుపుకుంటావని హెచ్చరిక మాత్రం చేస్తున్నాం.

విప్లవ రచయితల సంఘం,
కడప జిల్లా యూనిట్.

జలగంగారి పోలీసుబలగం మళ్ళీ విప్లవ రచయితల్ని నిర్బంధించింది. ఈసారి సరికొత్త 'కుట్ర'పన్ని అరెస్టులు సాగించింది. భావాల్ని బంధించటం అంటే గాలిని ఉరి తీయటం, పొంగి పొరలే అలల్ని అరికట్టటం. కుట్రలకు, కుతంత్రాలకు విప్లవ రచయితలు లొంగరని హెచ్చరిస్తూ– వెంటనే విప్లవరచయితల్ని విడుదల చేయవలసిందిగా డిమాండ్ చేస్తున్నాం.

విప్లవ రచయితల సంఘం,
నెల్లూరు జిల్లాశాఖ, నెల్లూరు.

## మే 18 న ప్రభుత్వపు కుట్ర

ఈ నెల 18 న విప్లవ రచయితల సంఘం (విరసం) కార్యదర్శి త్రిపురనేని మధుసూదనరావు 'సృజన'సంపాదకుడు, విరసం కార్యవర్గసభ్యుడు వరవరరావు మరో విరసం కా.వ.సభ్యుడు చెరబండరాజులను పోలీసులు అక్రమంగా అరెస్టుచేసి చెరసాలలో నిర్బంధించారు దోపిడీ ప్రభుత్వపు యీ దుశ్చర్యవల్ల మా సంస్థ దెబ్బతినకపోగా మూడుపువ్వులారు కాయలుగా వర్ధిల్లుతుంది. ఆఖరికి రచయితల భావస్వాతంత్ర్యాన్ని, పత్రికా స్వాతంత్ర్యాన్నికూడ సహించలేని స్థితికి దిగజారిన ప్రభుత్వ దమనకాండను ఖండిస్తున్నాము

తప్పుడు కుట్రకేసులలో యిరికించి దీర్ఘ కాల నిర్బంధానికి గురిచేసి మా సంస్థను దెబ్బతీయాలని చేస్తున్న ప్రభుత్వ కుట్రకు ప్రజలే తగినశిక్ష విధిస్తారు.

ప్రజలు ఇటువంటి ప్రభుత్వ పాశవిక చర్యలను అరికట్టవలసిందిగా కోరుతున్నాము–

విరసం వర్ధిల్లాలి!
విరసం సభ్యులు విడుదలకావాలి !!

కన్వీనర్,
కృష్ణా జిల్లా విరసం యూనిట్

## ప్రభుత్వ ఫాసిస్టు విధానాన్ని ప్రతిఘటించండి !

మొన్ననే విప్లవకవులు త్రిపురనేని మధుసూదనరావు, వరవరరావు, చెరబండ రాజు, ఎం.టి. ఖాన్, పిలుపు ఎడిటర్ రంగనాథంగార్లను, భారత చైనా మిత్రమండలి ఖమ్మం కార్యదర్శి కోటేశ్వరరావు మొదలగువారిని అరెస్టుచేసి ఆంధ్రప్రభుత్వం తన పాశవిక, నిర్బంధకాండను మరొకమారు నగ్నంగా ప్రదర్శించింది.

పౌరులుగా మన హక్కులు పరిరక్షించుకోవటంలో భాగంగా అరెస్టు అయిన మేధావుల విప్లవ రచయితలను విడుదలచేయించుకొనుట మన కర్తవ్యం– ప్రజాస్వామ్యవాదుల తమ కర్తవ్యంగా విప్లవరచయితల అరెస్టులను బహిరంగంగాఖండించి వారి విడుదలకు ప్రభుత్వంపై వొత్తిడి తీసుకురావలసిందిగా కోరుతున్నాం–

వరంగల్ జిల్లా పౌరహక్కుల కమిటీ

వరంగల్ విరసం యూనిట్ 19-5-74 నాటి తన తీర్మానంలో విప్లవ రచయితల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది– ప్రభుత్వ ఫాసిస్టు విధానాన్ని ఖండిస్తూ విప్లవ రచయితల విడుదలకై ఆందోళన చేయవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేసింది.



గుంటూరు జిల్లా పౌరహక్కుల సంఘం అత్యవసర సమావేశంజరిపి విప్లవరచయితలైన వరవరరావు, చెరబండరాజు, ఎం.టి. ఖాన్, త్రిపురనేని మధుసూదనరావు రంగనాథం మొదలైనవారిని అక్రమంగా అరెస్టుచేయటాన్ని ఖండిస్తూ తీర్మానించింది.

అలాగే న్యాయమైనా కోర్కెలకొరకు పోరాడుతున్న రైల్వేకార్మికులపైన ప్రభుత్వం అమలుజరుపుతున్న క్రూర నిర్బంధ విధానాన్ని సమావేశం తీవ్రంగా గర్హించుతున్నది

జి. కోటేశ్వరరావు, B Sc. B.L.
కార్యదర్శి
జిల్లా పౌరహక్కుల సంఘం,
బ్రాడీపేట, 1 వ లైను, గుంటూరు.

ప్రజల్లో చైతన్యాన్ని అరెస్టుచేయడానికి ఈ జైళ్లు అప్పుడప్పుడు నోర్లుతెరుస్తుంటాయి. ఈపాటికే రెండుసార్లు విప్లవకవులైన వరవరరావు, చెరబండరాజు గార్లను ఈ ప్రభుత్వం అరెస్టుచేసింది. ఆ చర్య రాజ్యాంగవిరుద్ధమంటూ రెండుసార్లు హైకోర్టు వారిని విడుదలచేసింది. అయినా బుద్ధిలేని యీ ప్రభుత్వం మూడవసారి వీరిని మళ్ళీ అరెస్టుచేసింది.

విప్లవకవులను అరెస్టుచేసి ప్రజల్లో విప్లవ చైతన్యాన్ని అరికట్టగలనని ఈ ప్రభుత్వం నమ్ముతున్నది. ఈ దోపిడీ పాలననుంచి విముక్తికోరుతున్న భారత ప్రజానీకం సాయుధ విప్లవమే తమ పోరాటరూపంగా స్వీకరించి ముందుకు సాగిపోతున్నారు. ఆ విప్లవ సాంప్రదాయాన్ని సాహిత్యరంగములో కాపాడుతున్న విప్లవ రచయితలను యీ ప్రభుత్వం ఎన్ని యిబ్బందులకు గురిచేసినా వారిని ప్రజలనుండి దూరం చేయలేరు. విప్లవం ప్రజల హక్కు. దానిని ప్రజలే సాయుధులై కాపాడుకొంటారు.

సామ్యవాద సాహిత్య సమితి,
కార్మిక కర్షక సంఘం, కదిరి

అనంతపురం జిల్లా రొద్దం అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సభలో పలువురు వక్తలు విప్లవ రచయితల అరెస్టులను ఖండిస్తూ ప్రసంగించారు. ప్రభుత్వపు యీ ప్రజావ్యతిరేక చర్యని ఖండించవలసిందిగా వారి విడుదలకు ఆందోళన జరుపవలసిందిగా ప్రజలను కోరారు–

టి. యస్. దేవశిఖామణి, కార్యదర్శి,
అభ్యుదయ సంఘం, రొద్దం

లేఖ :

## కామ్రేడ్ బి. వీరయ్య అరెస్టు–
## చారుమజుందార్ బుక్‌స్టాల్‌పై దాడి– పోలీసుల దౌర్జన్యం

ఈ నెల 22 వ తేది ఉదయం 8 గం.లకు ఖమ్మంలో కామ్రేడ్ వీరయ్యను కారణంచెప్పకుండానే అరెస్టుచేసి వరంగల్ జైలుకి తరలించారు– ఆ రాత్రి 12 గం కి మళ్ళీ పోలీసులు ఆయన యింటికివెళ్ళి దౌర్జన్యంగా కాళ్ళతో తన్ని యింటి తలుపులు పగులగొట్టి యిల్లంతా సోదాచేశారు– పుస్తకాలన్నీ స్వాధీనం చేసుకొన్నారు. తండ్రి కొడుకులు లేనప్పుడు దౌర్జన్యంగా యింట్లో ప్రవేశిస్తున్నారు– అంతకుముందు మే 4 నాడు వీరయ్య కొమారుడు బి. మల్లయ్యను ఏదో కేసులో యిరికించి నిర్బంధించారు. నీకొడుకు విప్లవ సాహిత్యమెందుకు చదువుతాడని ఆయన తల్లిని బెదిరించారు. మే 9 ఉదయం సాయుధులైన సి ఆర్ పివారు 'చారుమజుందార్ బుక్‌స్టాల్'పై నాలుగువైపుల నుండి దాడిచేసి కామ్రేడ్ వీరయ్యతో 'ఎక్కడపెట్టావురా పుస్తకాలు? ప్రత్యేకంగా యీ పుస్తకాలే ఎందుకమ్ముతావురా?' అంటూ చాలా దురుసుగా అసభ్యంగా ప్రవర్తించి చారుమజుందార్ వ్యాసాలు పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు–

ఈవిధంగా విప్లవ సాహిత్యం అమ్ముతున్నందుకు కామ్రేడ్ వీరయ్యను లోగడ పోలీసులు అనేకమారులు బెదిరించి అవమానించి కొట్టారు–

కామ్రేడ్ వీరయ్యనూ, మల్లయ్యనూ విడుదలచేయాలని డిమాండ్‌చేస్తూ, ప్రజల స్వాతంత్ర్యాన్ని అరికట్టే పోలీసుల నిరంకుశ ఫాసిస్టు విధానాన్ని ఖండించవలసిందిగా ప్రజాతంత్రవాదులందరినీ కోరుతున్నాం–

చారుమజుందార్ బుక్‌స్టాల్, ఖమ్మం.

---

## ఊరేగింపులు – బహిరంగ సభలు

19-5-71 నాడు వెల్దెండి గ్రామంలో ప్రగతిశీల విద్యార్థులు నిర్వహించిన ఊరే
గింపులో వెయ్యిమందికిపైగా ప్రజలు పాల్గొన్నారు. వెంకటరెడ్డిగారి అధ్యక్షతన
దాదాపు ఐదారువేలమందితో బహిరంగసభ జరిగింది. పత్తిపాటి వెంకటేశ్వర్లు రంగ
నాథం తదితరులు యిందులో మాట్లాడారు.

కామ్రేడ్ వరవరరావు అరెస్టును ఖండిస్తూ సభ తీర్మానంచేసింది–

21-5-74 నాడు పరచూర్‌లో డా॥ చాగంటి భాస్కరరావు స్మారకసభ జరిగింది. సభా కార్యక్రమానికి ముందు మూడువేల మందితో వూరేగింపు నడిచింది– ఇందులో దాదాపు రెండువందలమంది స్త్రీలుకూడా పాల్గొన్నారు. పదివేల జనం పాల్గొన్న బహిరంగసభలో కొల్లా వెంకయ్య, కె. వి ఆర్. శ్రీనివాసరావు, మాదా నారాయణస్వామి మొదలగు కామ్రేడ్స్ మాట్లాడారు– కామ్రేడ్ శ్రీనివాసరావు విప్లవ చరయితల అరెస్టులను తీవ్రంగా నిరసించాడు–

ఈ ఊరేగింపుల్లో వర్గశత్రు నిర్మూలనాయుద్ధం కొనసాగాలి, సాయుధ పోరాటం వర్ధిల్లాలి, కామ్రేడ్ చారుమజుందార్ అమర్ హై, అమరవీరులకు జోహార్లు అన్న నినాదాలను ప్రజలు యిచ్చారు.